సంచలన వార్తా పత్రిక
లీడర్
SANCHALANA VAARTHA PATRIKA LEADER


Read / Share / Follow
www.leaderepaper.com
www.facebook.com/leaderramanamurthy/
www.twitter.com/leaderramanamurthy/

మంగళవారం • 20 మార్చి 2018 । సంపుటి : 20 సంచిక : 232 । ఎడిటర్ : వి.వి.రమణమూర్తి । 8 పేజీలు । వెల : రూ. 2.00
Published from Visakhapatnam, Rajahmundry and Hyderabad

ఉద్యమిస్తే అరెస్ట్



విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి ర్యాలీగా వెళ్ళి డీఆర్ఎం కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ కార్యకర్తలను అరెస్ట్ చేసి ఈడ్చుకెళ్తున్న పోలీసులు - ఫోటోగ్రాఫర్, న్యూస్‌లీడర్




గుడి లోన నా సామి

అపచారం కాదు నిర్లక్ష్యమట !

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : సింహాచలం దేవస్థానం గర్భగుడిలో జరిగిన అపచారం వ్యవహారంలో దీనికి కారకుడైన చొడవర్తి శ్రీనివాసాచార్యుల్ని రక్షించడానికి సమస్త 'పండితులు' ప్రయత్నిస్తున్నారు. శ్రీనివాసాచార్యునికి తెలియకుండానే 'మహిళ' ప్రవేశం చేసిందా? అన్న ప్రశ్నకు సమాధానం లేదు. అసలు ఆ మహిళ ఎవరు? ఆ మహిళకూ శ్రీనివాసాచార్యునికి సంబంధం ఏమిటి? అన్న విషయాన్ని పరిశీలిస్తే, అసలు విషయం బయటకు వస్తుందని భక్తులు ఆశిస్తున్నారు. అయితే శ్రీనివాసాచార్యుల్ని కాపాడ్డానికి ఆలయ ఈవో రామచంద్ర మోహన్ ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఒత్తిడి కూడా వుందన్న వార్తలు వస్తున్నాయి. ఇది అపచారం కాదు, కేవలం నిర్లక్ష్యం అని సర్దుబాటు చేయడానికి ఫైళ్ళు కదులు తున్నాయి. స్వామివారికి రాజభోగం జరిగే సమయంలో 'మహిళ' ఉన్నప్పటికీ రాజభోగాలపై మూతలుపెట్టి ఉండడం వల్ల అపచారం జరగలేదని కొత్త వాదాన్ని తెరమీదరకు తెచ్చారు. అయితే మూతలు పెట్టిన రాజభోగం మహిళ వుండగానే ఆరగింపు ఎలా జరిగిందనే ప్రశ్నకు మాత్రం సమాధానం లేదు. ఆలయ అధికారులు చెప్తున్నట్టుగా అయితే ఆలయ సంప్రోక్షణకి - భక్తుల దర్శనాలను నిలిపివేయాలి. ఆలయ చేడా మండపం, గర్భగుడి లోపల వరకూ నీళ్ళతో కడిగేయాలి. ఇన్ని ఉపచర్యలు చేశాక ఎంతెంత చేయాలో రాజభోగం పెట్టారో ఆ ప్రసాదాన్ని పాతిపెట్టి, అంతకు రెండింతలు తయారు చేసి స్వామికి ఆరగింపు పెట్టాలి. కానీ ఇవన్నీ సింహాచలం ఆలయంలో జరగలేదు.

ఆమె ఎవరు?.. అపచారం కాదు నిర్లక్ష్యం

సింహాచలం దేవస్థానం గర్భగుడిలో జరిగిన అపచారం ఎవరివల్ల జరిగింది? ఆ సమయంలో గర్భగుడిలో వున్న ఆమె ఎవరు? ఆమె వివరాలను ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎందుకు బయటపెట్టడం లేదు? ఈ ప్రశ్నలకు సమాధానం దొరకడం లేదు. సంబంధిత అధికారులెవ్వరూ నోరు విప్పడం లేదు. అయితే గర్భగుడిలో 12వ తేదీ ఉదయం పదకొండున్నర గంటల సమయంలో ఒక మహిళ వుందన్న విషయమై దుమారం రేగుతున్న విషయం తెలిసిందే. దేవునికి నైవేద్యం పెట్టే సమయంలో అధికారుల, వైధికుల అనుమతి లేకుండా ఎవరూ గర్భగుడిలోకి ప్రవేశించరాదు. అందు



లోనూ 'మహిళ' ప్రవేశానికి పూర్తిగా నిశిద్ధం వుంది. అయినప్పటికీ మహిళ ఎలా ప్రవేశించింది? అనడానికి సమాధానం లేదు. దీనికి కారణమైన వారిపై ఇంతవరకూ ఎటువంటి చర్యలేదు. ఈ సమయంలో ఒక పత్రికా విలేకరి అక్కడే వున్నారట. సీసీ ఫుట్‌జిల్లో ఆ విలేకరి కనిపించారన్న విషయం బయటకు వచ్చింది. అయితే మిగతా 2లో ▶

వెంకటేశ్వరరావుపై
క్రిమినల్ కేసుకు ఛాన్స్ లేదు



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : విశాఖ ఆర్డీఓ ఎస్.వెంకటేశ్వరరావు పై క్రిమినల్ కేసులు పెట్టడానికి అవకాశం లేదని జిల్లా అధికారులు నిర్ధారణకు వచ్చారు. ఇప్పటికే వెంకటేశ్వరరావు సస్పెన్షన్‌లో వున్న విషయం తెలిసిందే. ఆర్డీఓ వెంకటేశ్వరరావు క్వాసీ జ్యూడీషియల్ అధికారులతో ఉత్తర్వులు జారీ చేసినందువల్ల ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోడానికి అవకాశం లేదని న్యాయనిపుణులు తేల్చారు. పోలీసు కమిషనర్ యోగానంద్ కూడా ఇదే అభిప్రాయాన్ని వెల్లడించారు. అయితే ప్రభుత్వం నుంచి మాత్రం వేంకటేశ్వరరావుపై క్రమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు వచ్చాయి. అయితే ఏ సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేయాలో ప్రభుత్వమే తెలియజేయాలని జిల్లా యంత్రాంగం తిరిగి ప్రభుత్వాన్ని కోరింది. ఈ లోగా ఏసీబీ ద్వారా మిగతా 2లో ▶



అన్నంత పనే జరిగింది

- పార్లమెంట్‌లో చర్చకు నోచని "అవిశ్వాసం'
- ఉభయ సభల్లో కొనసాగిన గందరగోళం
- రేపటికి వాయిదా
- అన్నాడీఎంకే, టీఆర్ఎస్ ఆందోళనతో సాగని సభలు


ఢిల్లీ: సభ సజావుగా సాగితేనే అవిశ్వాసంపై చర్చకు అవకాశం కల్పిస్తామంటూ ముందు నుంచి చెబుతున్నా లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ అన్నంత పనే చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఈ నెల 17 వ తేదీన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ, వైసీపీ పార్టీలు అవిశ్వాస నోటీసులు అందచేసిన విషయం విధితమే. అయితే సోమవారానికి ఉభయ సభలు వాయిదా పడడంతో చర్చకు వస్తాయని అంతా భావించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం కూడా టీడీపీ, వైసీపీలు మళ్లీ స్పీకర్‌కు అవిశ్వాస నోటీసులు అందచేశాయి. అయితే సభ ప్రారంభం నుండే గందరగోళం నెలకొంది. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే తెరాస, అన్నా డీఎంకే సభ్యులు ఆందోళన చేయడంతో సభ 12 గంటలకు వాయిదా పడింది. గంట తరువాత సభ ప్రారంభమయ్యాక కూడా అదే పరిస్థితి నెలకొంది. కావేరీ మిగతా 3లో ▶

మళ్లీ నోటీసులిచ్చిన వైఎస్సార్‌సీపీ



ఢిల్లీ: వైఎస్సార్‌సీపీ మరోమారు అవిశ్వాసతీర్మానం పెట్టనుంది. సోమవారం లోక్‌సభ వాయిదా పడిన అనంతరం ఎంపీ వైవీ సుబ్బారెడ్డి.. లోక్‌సభ సెక్రెటరీ జనరల్ స్నేహలతా శ్రీవాత్సవకు మిగతా 3లో ▶

భాజపా-వైకాపా
దోస్తీ బట్టబయలైంది
ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి, న్యూస్‌లీడర్ : భాజపాతో వైకాపా కుమ్మక్కైందని ప్రజలకు స్పష్టంగా తెలిసిపోయిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు వంగివంగి నమస్కారాలు చేసినప్పుడే వారి లాలూచీ అర్థమైందన్నారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో చంద్రబాబు సోమవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'ఏపీకి జరిగిన అన్యాయంపై, తెదేపా అవిశ్వాస తీర్మానంపై జాతీయ స్థాయిలో విపరీతంగా చర్చ జరుగుతోంది. వివిధ మిగతా 2లో ▶

రూ.11,300కోట్లు ఎవరివో..?

బ్యాంకుల్లో పేరుకుపోతున్న అన్‌క్లెయిమ్‌డ్ డిపాజిట్లు



ముంబయి : దేశవ్యాప్తంగా 64 బ్యాంకుల్లో రూ.11,300కోట్లు అన్‌క్లెయిమ్‌డ్ (ఎవరివో తెలియని) డిపాజిట్లుగా ఉన్నాయి. దాదాపు 3కోట్లకు పైగా ఖాతాల్లో ఈ సొమ్ము నిల్వ ఉంది. ఈ మేరకు ఆర్‌బీఐ విడుదల చేసిన డేటా ద్వారా వెల్లడైంది. బ్యాంకుల్లో డిపాజిట్లు చేసి ఏళ్ల తరబడి వాటిని తీసుకోవడానికి ఎవరూ రాకపోవడం లేదా.. ఆ డిపాజిట్‌దారులు చనిపోతే వారి వారసుల వివరాలు లేకపోవడంతో ఆయా ఖాతాల్లోని డిపాజిట్లు అన్‌క్లెయిమ్‌డ్‌గా మారిపోతాయి. అలా 64 బ్యాంకుల్లోని దాదాపు 3కోట్లకు పైగా ఖాతాల్లో రూ. 11,300కోట్లు అన్‌క్లెయిమ్‌డ్‌గా ఉన్నట్లు మిగతా 2లో ▶

జగమేమాయ!



ఆయనకేం.. ఢిల్లీలో వుండి బాగానే చెబుతాడు... టిడిపి తప్పులు ఎంచడం తర్వాత.. మనమేంచేసామని జనాల్లోకి వెళ్తాం..!

ఆర్టీసీకి ప్రైవేటు

- శాఖల మధ్య సమన్వయ లోపం
- ప్రజా రవాణాలో ప్రైవేటుదే పైచేయి



విజయనగరం, న్యూస్ లీడర్: వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం.. ప్రైవేటుకు బాగా కలిసివస్తోంది. ప్రజా రవాణా రంగంలో ప్రైవేటు హవా రోజురోజుకూ పెరుగుతోంది. ఆర్టీసీ ఉదాసీనత, రవాణాశాఖ నిర్లక్ష్యం వెరసి ప్రైవేటు ఆపరేటర్లకు కాసులు కురిపిస్తోంది. ఆర్టీసీ అధికారులు ప్రకటనలకే పరిమితమైతే, రవాణాశాఖాధికారులు జాతీయ రహదారితో సరిపెడుతున్నారు. ఇదే ప్రైవేటు ఆపరేటర్లకు కనకవర్షం కురిపిస్తోంది. అధికారుల పుణ్యమా అని ప్రైవేటు ఆపరేటర్లు నిబంధనలకు బహిరంగంగానే తూట్లు పొడుస్తున్నారు. బస్సుల రవాణా ప్రైవేటువారి ఇష్టారాజ్యంగా మారింది. నిబంధనల ప్రకారం ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో ప్రైవేటు వాహనాలు నిలుపరాదు. ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే ప్రయాణీకులను తమవైపు తిప్పుకోరాదు. కాని జిల్లా కేంద్రమైన విజయనగరంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా మిగతా 3లో ▶

సంచలన వార్తాపత్రిక
లీడర్
క్లాసిఫైడ్స్
విశాఖపట్నం
మంగళవారం 20-3-2018

వేంకటేశ్వరరావుపై క్రిమినల్ కేసుకు ఛాన్స్ లేదు

(మొదటిపేజీ తరువాయి)


వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేయించాలని ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఆర్డీఓ వెంకటేశ్వరరావు ఇచ్చిన ఉత్తర్వులు అన్నిటినీ అమలు చేయకుండా నిలిపివేస్తూ జిల్లా జాయింట్ కలెక్టర్ సృజన చర్యలు తీసుకున్నారు.

ఆ అడ్డగోలు ఉత్తర్వులివే..

ఆర్‌వోఆర్ అప్పిలేట్ అథారిటీ భీమిలి మండలం దాకమర్రి గ్రామ సర్వే నెం. 331/2లోని భూములకు సంబంధించి దేవాదాయ శాఖకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చేశారు. అడవివరంలో సర్వేనెం.197లో టీడీ నెం.1173 ద్వారా సింహాచలం దేవస్థానానికి 1996లో దాఖలు పడిన 4.33 ఎకరాల భూమిలో 2400 చ.గ.భూమితనదంటూ కె.సీతారామస్వామి అనే వ్యక్తి ఆర్డీవో కోర్టులో కేసు వేయగా అతనికి అనుకూలంగా ఆర్డర్ పాస్ చేశారు. పెందుర్తి మండలం వేపగుంటలో సర్వే నెం.30లో సింహాచలం దేవస్థానానికి చెందిన 14 ఎకరాలు భూమిని పీతల పాపాయమ్మ అనే మహిళకు ధారాదత్తం చేస్తూ ఆర్డీవో ఆర్డర్ జారీ చేశారు. సింహాచలం దేవస్థానం దత్తతలో ఉన్న కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయానికి ఆనందపురం మండలం రామవరంలో సర్వే నెం.3/1.4నున్న 99.20 ఎకరాల భూముల వ్యవహారంలో కూడా ఇదే తరహాలో అప్పిలేట్ అథారిటీగా తీర్పునిచ్చేశారు. ఈ కేసుల్లో సింహాచలం దేవస్థానంతో పాటు దేవాదాయ శాఖ కూడా జేసీ కోర్టులో అప్పీల్ దాఖలు చేశాయి. ఆర్‌వోఆర్ చట్టం కింద కాపులుప్పాడ గ్రామ సర్వే నెం. 131/5లోనూ, ఆనందపురం మండలం గంగసాని అగ్రహారం సర్వే నెం.3/1, 3/4, ఆనందపురం మండలం రామవరం గ్రామ సర్వేనెం.12,127,128, 130లలోని వివాదస్పద భూముల వ్యవహారంలో ఆర్డీవో ఇచ్చిన తీర్పులపై జేసీ కోర్టులో అప్పీల్ చేశారు. పెందుర్తి మండలం వేపగుంట గ్రామ సర్వే నెం.30 విశాఖ రూరల్ మండలం అడవివరం సర్వే నెం. 197, పెందుర్తి మండలం సర్వే నెం. 107/11లోని 8 ఎకరాల భూముల విషయంలో కూడా జేసీ కోర్టులో అప్పీల్ చేశారు.

మిలియనీర్ల వలస బాట..

న్యూఢిల్లీ : నల్లధనంపై నియంత్ర ణలతో 2014 నుంచి పెద్దసంఖ్యలో డాలర్ మిలియనీర్లు భారత్‌ను విడిచివెళ్లారు. చైనా, ఫ్రాన్స్ కంటే భారత్ నుంచే డాలర్ మిలియనీర్లు అత్యధికంగా విదేశాలకు తరలివెళ్లారు. 2014 నుంచి 23,000 మంది మిలియనీర్లు దేశం వీడివెళ్లగా వీరిలో కేవలం 2017లోనే 7000 మంది విదేశాలకు చెక్కేశారని మోర్గాన్ స్టాన్లీలో చీఫ్ గ్లోబల్ స్ట్రేటజిస్ట్ రుచిర్ శర్మ విశ్లేషించారు. భారత సంపన్నుల్లో 2.1 శాతం మంది దేశాన్ని వీడగా, ఫ్రాన్స్ సంపన్నుల్లో 1.3 శాతం, చైనా సంపన్నుల్లో 1.1 శాతం ఆయా దేశాలను విడిచివెళ్లారని చెప్పుకొచ్చా రు. 1,50,000 మంది మిలియ నీర్లపై ఎన్‌డబ్ల్యూ వరల్డ్ వెల్లడించిన గణాంకాలను బట్టి ఈ



వివరాలు వెల్లడయ్యాయి.కారణమేదైనా సంపన్నులు ఇంత పెద్ద సంఖ్యలో దేశం వీడటం ఆర్థిక వ్యవస్థకు మేలు చేకూర్చబోదని రుచిర్ శర్మ పేర్కొన్నారు. ప్రపంచ సంపన్నులంతా అక్లాండ్, మోంట్రీల్, టెల్‌అవీవ్, టొరంటో వంటి నగరాలను ఎంచుకుంటున్నారని ఆయన విశ్లేషించారు.ఇక భారత్ నుంచి సంపన్నులు అధికంగా బ్రిటన్, దుబాయ్, సింగపూర్‌ల వైపు మొగ్గుచూపుతున్నారు. దేశం వెలుపల ఆరు నెలలుపైగా గడిపిన వారిని ఈ జాబితాలో చేర్చారు. మరోవైపు ఫ్రాన్స్ నుంచీ కూడా మిలియనీర్లు పెద్దసంఖ్యలోనే వేరే దేశాలకు తరలివెళ్లారు. ఐరోపా యూనియన్ విచ్ఛిన్నమైన అనంతరం బ్రిటన్ నుంచి సైతం పలువురు సంపన్నులు ప్రపంచంలోని ఇతర నగరాలకు వలసవెళ్లారు. భారత్‌లో పన్ను చట్టాలను కఠినతరం చేయడం, బ్లాక్ మనీపై నియంత్రణలు, ఎన్‌పీఏల ఒత్తిడితో కొందరు సంపన్నులు ఇతర దేశాలకు తరలివెళ్లినట్టు ఈ గణాంకాలు స్పష్టం చేశాయి.

రూ.11,300కోట్లు ఎవరివో..?

(మొదటిపేజీ తరువాయి)

ఆర్‌బీఐ తెలిపింది. వీటిలో అత్యధికంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(పీఎన్‌బీ)లో రూ. 1,262కోట్లు, పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ)లో రూ. 1,250కోట్లు అన్‌క్లెయిమ్‌డ్‌గా ఉన్నాయి. ఇక మిగతా అన్ని జాతీయ బ్యాంకుల్లో కలిపి రూ. 7,040కోట్లు ఉన్నాయి. ప్రైవేటు బ్యాంకుల్లో రూ. 1,416కోట్లు అన్‌క్లెయిమ్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. మిగతా రూ.332కోట్లు మన దేశంలో కొనసాగుతున్న 25 విదేశీ బ్యాంకుల వద్ద ఉన్నాయి. ఏడు ప్రైవేటు బ్యాంకులు యాక్సిస్ బ్యాంక్, డీసీబీ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, ఇండస్‌ఇండ్, కొటక్ మహింద్రా, యస్ బ్యాంక్‌లు కలిపి రూ. 824కోట్లు, మరో 12 ప్రైవేటు బ్యాంకుల్లో రూ. 592కోట్లు అన్‌క్లెయిమ్‌డ్‌గా పడి ఉన్నాయి. వీటిలో అత్యధికంగా ఐసీఐసీఐలో రూ. 476కోట్లు, కొటక్ మహింద్రా బ్యాంక్ వద్ద రూ. 151కోట్లు అన్‌క్లెయిమ్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి.

కేంద్రం చర్చకు భయపడుతోంది: తెదేపా

దిల్లీ: అవిశ్వాస తీర్మానంపై పార్లమెంటులో చర్చకు కేంద్రం బయపడి పారిపోతోందని తెలుగుదేశం ఎంపీలు అన్నారు. దిల్లీలో వారు మీడియాతో మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా ఏపీకి అది చేస్తాం.. ఇది చేస్తామంటూ పబ్బం గడిపిన కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో సమాధానం చెప్పలేకపోతోందన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో వెనక్కి తగ్గేది లేదని... రాష్ట్రానికి జరిగిన అన్యాయ్యాన్ని పార్లమెంటులో నిలదీసి తీరుతామని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి లోక్‌సభలో మాట్లాడిన సమయంలో కేంద్రమంత్రి అనంత్‌కుమార్ తమతో మాట్లాడి ఆ సమయంలో ఆందోళన చేయొద్దని వారించారని.. ఈరోజు తెరాస, అన్నాడీఎంకే సభ్యులతో కేంద్రం మాట్లాడి సభ సక్రమంగా జరిగేలా ఎందుకు చేయలేదని ఎంపీలు ప్రశ్నించారు. ఈ రోజు సభ జరగకుండా స్పీకర్, కేంద్ర ప్రభుత్వం మ్యాక్ ఫిక్సింగ్ చేసినట్లు తమకు అనుమానం కలుగుతోందన్నారు. ఆందోళన చేస్తున్న ఎంపీలతో చర్చించి సభ జరిగేలా చేయడం ప్రభుత్వానికి చేతకాదా? అని ప్రశ్నించారు. ఉగాది సందర్భంగా స్పీకర్ విందుకు ఆహ్వానించగా తిరస్కరించినట్లు తోట నరసింహం తెలిపారు. ఓ పక్క కేంద్రం ఆంధ్రప్రదేశ్‌ను చిన్నచూపు చూస్తూ అవమానిస్తుంటే విందుకు ఎలా వెళతామని ప్రశ్నించారు. కేవలం రాజకీయ ఎత్తుగడతోనే భాజపా ఏపీ పట్ల వివక్ష చూపుతోందన్నారు. విభజన సమస్యలపై చర్చ జరిగేవరకూ రోజూ అవిశ్వాస తీర్మానం ఇస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

కోలకతాకు కేసీఆర్
ఫ్రంట్ ఏర్పాటుపై ముమ్మర ప్రయత్నాలు

హైదరాబాద్: తెలంగాణ సీఎం కేసీఆర్ కోల్‌కతాకు బయల్దేరి వెళ్లారు. ఫెడరల్ ఫ్రంట్‌పై ఆయన మమతతో చర్చించనున్నారు. ప్రాంతీయ పార్టీలను ఒకే తాటిపైకి తెచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కేసీఆర్ వెంట పార్టీ సీనియర్ నేతలు కూడా వెళ్లారు. ఫ్రంట్‌కు న్యాయకత్వం వహిస్తానని చెప్పిన సీఎం... పశ్చిమ బెంగాల్ సీఎం మమత బెనర్జీతో చర్చలు జరపనున్నారు. ఆమె ఓతో భేటీ అయి కూటమి, లక్ష్యాలు వంటి అంశాలపై చర్చించను న్నారు. ఫ్రంట్ ఏర్పాటు చేస్తానన్న ప్రకటన తర్వాత కేసీఆర్ నిర్వహించే తొలి సమావేశం ఇదే కావడంతో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

భాజపా-వైకాపా దోస్తీ బట్టబయలైంది

పార్టీలు మనకు మద్దతు ప్రకటించాయి. అవిశ్వాస తీర్మానంపై చర్చ చేపట్టకుండా సభ వాయిదా వేస్తే ఎంపీలు యథావిధిగా ఆందోళన కొనసాగించాలి. రాష్ట్రానికి న్యాయం చేయాలని మాత్రమే మనం అడుగుతున్నాం. న్యాయం కోరిన వారిపై భాజపా యుద్ధం చేయాలని చూస్తోంది. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్లీనరీలో చెప్పింది. అలాంటప్పుడు కేంద్రానికి ఉన్న అభ్యంతరం ఏమిటి? కేసుల మాఫీ కోసమే వైకాపా అధినేత జగన్ అప్పుడు కాంగ్రెస్‌తో, ఇప్పుడు భాజపాతో లాలూచీ పడ్డాడు. వీళ్ల కేసుల కోసం రాష్ట్ర భవిష్యత్‌ను తాకట్టు పెట్టడం ఎంతవరకు సమంజసం?. భాజపా ఒక పార్టీతో అవిశ్వాస తీర్మానం పెట్టించి.. మరోపార్టీతో ఆందోళన చేయించాలని చూస్తోంది. సభ వాయిదా వేసుకుపోవాలని చూడటం లాలూచీ రాజకీయాలకు పరాకాష్ఠ కాదా?' 'జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇప్పుడే ఎందుకు యూ టర్న్ తీసుకున్నారో అందరికీ తెలుసు. నాలుగేళ్లుగా విమర్శించని వ్యక్తి ఇప్పుడే ఎందుకు విమర్శలు చేస్తున్నారు. తప్పుడు పనులు చేసేవారు దొంగాట ఆడుతున్నారు. లాలూచీ రాజకీయాలను బయటపెట్టాలి. కుట్ర రాజకీయాలను ఎండగట్టాలి. ఏపీ ప్రజల హక్కులపై రాజీపడే ప్రస్తకే లేదు. విభజన చట్టంలోని 19 అంశాలు, పార్లమెంటు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. ఆంధ్రప్రదేశ్ పొరుగు రాష్ట్రాలతో సమాన స్థాయికి వచ్చేదాకా కేంద్రం చేయూతనివ్వాలి' అని చంద్రబాబు డిమాండ్ చేశారు.

రష్యా అధ్యక్షుడిగా మరోసారి పుతిన్

మాస్కో: రష్యా అధ్యక్షుడిగా వ్లాదిమర్ పుతిన్ మరోసారి ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఆయనకు 76.67శాతం ఓట్లు పడినట్లు రష్యా కేంద్ర ఎన్నికల సంఘం నేడు అధికారికంగా వెల్లడించింది. దీంతో మరో ఆరేళ్ల పాటు అంటే 2024 వరకూ ఆయన అధ్యక్షుడిగా కొనసాగుతారు. పుతిన్ అధ్యక్షుడిగా ఎన్నికవడం ఇది నాలుగోసారి.రష్యా అధ్యక్ష ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఈ ఎన్నికల్లో 99.8శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. పుతిన్‌తో పాటు మరో ఏడుగురు అభ్యర్థులు బరిలోకి దిగారు. అయితే న్యాయ పరమైన కారణాలతో పుతిన్ ప్రధాన అభ్యర్థి అలెక్సీ నావల్నీ బరిలో నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.

గుడిలోన నా సామి

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన అపచారం గురించి అక్కడ పరిచారకులకు, అర్చకులకు మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ విషయం బయటకు వస్తే కొంపలు మునుగుతాయన్న విషయాన్ని ఈ విలేకరి గ్రహించాడు. దీంతో బయటకు ఈ విషయం పొక్కకుండా వుండడానికి వారితో బేరానికి దిగినట్టు కూడా వార్తలొస్తున్నాయి. అయితే బేరం కుదరక పోవడంతో విషయం బయటకు వచ్చేసిందన్నది ఒక వాదన. అయితే మహిళ ప్రవేశం ద్వారా ఆలయ సాంప్రదాయాలకు తిలోదకాలిచ్చి అపచారానికి పాల్పడినప్పటికీ, దీనిని అపచారం కాదు, ఇది నిర్లక్ష్యం వల్ల జరిగింది అని మార్చడానికి దేవదాయశాఖలో తిమ్మిని బమ్మి, బమ్మిని తిమ్మి చేయగల సిద్ధహస్తులంతా సిద్ధమయ్యారు.

ఎవరైనా భక్తులు రాజభోగం పెట్టే సమయంలో లోపల వుండిపోతే ఆరగింపు భోగాలపై మూతలు వేసి తెరవెనుక పెట్టేసి, తిరిగి అదే ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేస్తారు. స్వామికి నివేదన చెయ్యవచ్చా అంటు పలువురు ఆధ్యాత్మక వేత్తలు వైదిక వర్గాలను ప్రశ్నిస్తోంది. అదికూడా ఈ భోగం, సాంప్రదాయ ఆచారాలలో భాష్యం వేరు, అంతరంగికం వేరని వారు చెబుతున్నారు. అదే నిజమైతే అప్పన్న వైదిక వర్గాలు చెప్పిందే నిజమైతే నిరూపించాలని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇదే నిజమైతే భోగాల సమయం అరగంట ఎందుకని భక్తులకు దర్శనం కల్పిస్తూ మీరు ఆరగింపు భోగాలు పెట్టుకోవచ్చుకదా అని ప్రశ్నిస్తున్నారు. దీనిపై దేవాదాయ శాఖ అధికారులు మరింత లోతుగా దర్యప్తు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

ఐఏఎస్ సంఘం నాయకుల చేత చెప్పిస్తున్న దేవస్థానం నాయకుడు..

సింహాచలం దేవాస్థానంలో మహిళ ఆలయ గర్భగుడిలో వుండటం అపచారం వ్యవహారంలో ముఖ్యపాత్ర పోషించిన గొడవర్తి శ్రీనివాసాచార్యల ప్రియమిత్రుడు దేవాస్థానంలో రాష్ట్ర నాయకుడుగా చలామణి అవుతూ... ఈ వ్యవహారంలో సెటిల్‌మెట్లు చేస్తున్నట్టు పలుఆరోపణలు వినిపిస్తున్నాయి, ఈ వ్యవహారం ఐఏఎస్ ప్రిన్సిపాల్ సెక్రటరీ సతీష్‌చంద్ర వద్దకు చేరుకుంది, పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కూడా ఈ విషయమై అసెంబ్లీలో దేవస్థానంలో జరిగిన అపచారం కేసులో మహిళ వుండటం, ఆమహిళ ఎవరి ద్వారా ఆలయంలోకి ప్రవేశించింది. దీనిపై దుర్గగుడిలో జరిగిన అపాచారం లానే దర్యప్తు చేసి ఈఓతో పాటు ఇతర అర్చకులు సిబ్బందిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. శ్రీనివాసాచార్యుల్ని ఎలాగైనా కాపుడోవాలనే ఉద్దేశంతో గతంలో ఎప్పుడో వారు ప్రవేశపెట్టిన అర్చకుల రొటేషన్ పద్దతి తిగిరి తెరపైకి తీసుకు వచ్చారు. అపచారం చేసిన వ్యక్తిని కాపాడే ప్రయత్నంలో భాగంగా ఈఓ రామచంద్రమోహన్ మీడియా ముందు ఒకసారి అపచారమంటు మరోసారి నిర్లక్ష్యమని పేర్కొనడం గమనార్హం. అంతేకాకుండా శ్రీనివాసాచార్యులను లక్ష్మీనారాయణ సన్నిధిలో ఆలయయంలోనే పుంచడంపై పలు విమర్శలకు తావిస్తుంది.

సంచలన వార్తాపత్రిక
లీడర్
విశాఖపట్నం సిటీ
విశాఖపట్నం
మంగళవారం 20-3-2018

సీఎం సహాయ నిధి అందజేత

దాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: దక్షిణనియోజక వర్గంలో సోమవారం 29, 25 వార్డు అల్లూరి వీధి, ఎస్‌వీపీ నగర్‌లో అరోగ్యసమస్యలపై బాధపడుతున్న బాధితులకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందజేశారు. బాధితురాలు మరుపల్లి ధనలక్ష్మికి రూ. 50వేలు చెక్కును అందజేశారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అందిపుచ్చుకోవాలని కోరారు.

చంద్రబాబువి సిగ్గుమాలిన చర్యలు

- వైసీపీ నేతలను అరెస్టు చేసిన పోలీసులు
- తోపులాటలో తైనాలకు గాయాలు
- వైసీపీ తూర్పు ఇన్‌చార్జి వంశీకృష్ణ యాదవ్
- పార్టీ అధ్యక్షుడు, మళ్ళ విజయప్రసాద్



మానవ హారం వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న వైసీపీ నేతలు


దాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రెండునాలుకల ధోరణితో మాట్లాడే తీరు సిగ్గుమాలిన చర్యలని వైసీపీ నాయకులు వంశీకృష్ణ యాదవ్ మండిపడ్డారు. ప్రత్యేక హోదా, రైల్వేజోన్ సాధన, పార్లమెంట్‌లో వైసీపీ అవిశ్వాసతీర్మానాలకు సంఘీభావంగా వైసీపీ ఆధ్వర్యంలో సోమవారం జనుకతోట జంక్షన్ దరి రహదారి నిర్బంధం చేసి నిరసన తెలియజేశారు. అప్పటికే మోహరించిన పోలీసులు నాయకులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించే ప్రయత్నంలో నాయకులకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ నేపథ్యంలో వైసీపీ నాయకులు తైనాల విజయకుమార్ ముక్కుకు



మానవహారంలో పాల్గొన్న తైనాల, వంశీకృష్ణ, తదితరులు

గాయాలయ్యాయి. ఈ సందర్భంగా వంశీకృష్ణ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర విభజనలో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ కు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల మేరకు ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కోరిక విశాఖ ప్రత్యేక రైల్వేజోన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రం బీజేపీతో మిత్ర పక్షంగా వున్న టీడీపీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాలుగేళ్ళుగా ప్రజలను మభ్యపెడుతూ బ్రామాలాడారని దుయ్యబట్టారు. ఒకసారి ప్రత్యేక ప్యాకేజీ చాలా బాగుందని, ప్రత్యేక హోదా ఏమైనా సంజీవా? అని ప్రశ్నించిన ముఖ్యమంత్రి చంద్రబాబు అంధ్రుల తిరుగుబాటుతో మళ్ళీ యూ టర్న్ తీసుకుని ప్రత్యేక హోదాపై మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. వైసీపీ అధినేత మొట్టమొదటిసారిగా ప్రత్యేక హోదాపై అవిశ్వాస తీర్మానంకు మద్దతు ఇవ్వకుండా తామే అవిశ్వాసం పెడతామని చెప్పడం సిగ్గుమాలిన చర్యగా భావిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పేర్ల విజయచంద్ర, గంపా పాసూర్, కొయ్యప్రసాద్ రెడ్డి, రవిరెడ్డి తదితరులు అరెస్టు అయ్యారు.

ఎన్‌ఏడీ జంక్షన్‌లో




ఎన్‌ఏడీ జంక్షన్ వద్ద రాస్తారోకో చేస్తున్న మళ్ళ విజయప్రసాద్ తదితరులు

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధన కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు లోక్‌సభలో ప్రవేశ పెట్టిన నేపథ్యములో అవిశ్వాస తీర్మానం సోమవారం చర్చకు రానున్న సందర్భంగా రాష్ట్రంలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజా సంకల్ప మానవహారం కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. నగర వైఎస్సార్సీపీ పార్టీ అధ్యక్షుడు, మళ్ల విజయప్రసాద్ ఆధ్వర్యం లో ఎన్ ఏ డి కొత్తరోడ్డు జంక్షన్ లో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నేతలతో మానవహారం కార్యక్రమం చేపట్టారు. చేరుకొనిన ఈ కార్యక్ర మంలో ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, మేధావులు భాగస్వాములు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు ప్రత్యేక ప్యాకేజి తో మోసపోవద్దు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నశించాలి అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా నగర పార్టీ అధ్యక్షుడు మళ్ల విజయప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ప్రత్యేక హోదా ఆకాంక్ష ఢిల్లీకి తెలిసే విధంగా ప్రజా సంకల్ప మానవహారాన్ని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రత్యేక హోదా కావాలని అనాటి నుంచి ఈనాటి వరకు కావాలని నిరూపించుకున్న ఏకైక వ్యక్తి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి అని ఈ సందర్భంగా అయినా గుర్తు చేశారు. పశ్చిమ నియోజకవర్గంలో నగరంలో అతి పెద్ద జంక్షన్ అయినా ఎన్. ఏ .డి కొత్త రోడ్డులో పార్టీ తలపెట్టిన ఈ మానవ హారం కార్యక్రమానికి వచ్చిన పార్టీ నాయకులకు విద్యార్థి సంఘాలకు భారీగా తరలి రావడం చాలా ఆనందదాయకమని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు జియ్యాని శ్రీధర్, చుక్కా ప్రసాదరెడ్డి, వైఎస్సార్ సిటి ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కరిరెడ్డి, బద్రినాథ్ పక్కి దివాకర్, గొర్లె అప్పలస్వామినాయుడు, ఆదారి శ్రీను, ముద్దు వాణి నాగరాజ్, కాగిత పైడి రత్నాకర్ పిలక రాజారెడ్డి, పివి సురేష్, జిఎస్ఎస్ రాజు, నగర కార్యదర్శులు ఎల్లపు వెంకటేశ్వరరావు, అల్లు పైడిరాజు, బాకీ శ్యాం కుమార్ రెడ్డి, అల్లాడ కృష్ణ, దొడ్డి సతీష్, దొడ్డి కన్నా, నగర మహిళా అధ్యక్షురాలు గరికిన గౌరి, శ్రీదేవివర్మ అధిక సంఖ్యలో మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామస్వరాజ్య హక్కులును కాపాడుకోవాలి

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ




సదస్సులో ప్రసంగిస్తున్న ఈఏఎస్ శర్మ

దాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్: భారతరాజ్యాంగంలో వున్న హక్కుల మేరకు గ్రామస్వరాజ్య హక్కులను కాపాడుకోవాలని కేంద్ర ప్రభుత్వ మాజీ ఇంధన కార్యదర్శి ఈఏఎస్ శర్మ అన్నారు. విశాఖపౌరగ్రంథాలయంలో సోమవారం జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక సంస్థల సాధికారత- జన్మభూమి కమిటీలపై సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా ఐఏఎస్ అధికారి ఐఏఎస్ శర్మ, రాజనీతి శాస్త్ర ఆచార్యులు కె.ప్రసన్న మాజీ వీసీ బాల మోహన్ దాస్‌తో పాటు వివిధ పార్టీ నేతలే హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ ప్రజా ఉద్యమంతో మార్పు రావాలని కోరారు. ప్రజాస్వామ్యానికి పునాది గ్రామసభలని కాపాడుకునేవిధంగా ప్రజలు పోరాటం చేయాలన్నారు. గ్రామసభ అధికారాలపై అవగాహన లోపించడం వలన ప్రజాప్రయోజనాలకు గండిపడుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన అనధికార జన్మభూమి కమిటీలు రాజ్యాంగ విరుద్దమని మండిపడ్డారు. గ్రామసభల నిర్ణయం మేరకు గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అర్హులైన లబ్దిదారులకు ప్రభుత్వ పథకాలు పొందలన్నా, రేషన్ కార్డులు, పింఛన్లు తదితరాలు కలెక్టర్‌కు కూడా లేని అధికారాలు రాష్ట్ర ప్రభుత్వం జన్మభూమి కమిటీలకు కల్పించడం దారుణమన్నారు. నేడు రాష్ట్రంలో ఏ గ్రామ సర్పంచ్‌కు అధికారాలు లేవని కేవలం జన్మభూమి కమిటీలు అనుమతులు లేకుండా నామమాత్రంగానైనా గ్రామసభలు నిర్వహించలేకపోతున్నారన్నారు. అందువలనే గ్రామాభివృద్ధి సాధ్యంకావడం లేదన్నారు. ఇంత వరకు రాష్ట్రంలో ఏ ఒక్క ముఖ్యమంత్రి కూడా పంచాయితీ వ్యవస్థ గురించి పట్టించుకునే దాఖలాలు లేవన్నారు. వ్యవస్థలనీ చదవాల్సిన బాధ్యత విశ్వవిద్యాలయాలపై వుందని అన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రొఫెసర్ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ మీడియా, విద్యావ్యవస్థల సూచనలు కలిసి పనిచేస్తేనే గ్రామాభివృద్ధి జరుగుతుందన్నారు. వీటిపై విశ్వవిద్యాలయాలు పరిశోధన చేసి సమాచారాన్ని ఇవ్వాలన్నారు. దేశంలో కేరళలో మాత్రమే గ్రామసభలపై ఆధారపడటం వలన అక్కడ అభివృద్ధి చెందాయని, కేరళ మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లో మార్పు రావాలన్నారు. ప్రపంచ చరిత్రలో ఒక్క రక్తపు బిందువు కూడా రాల్చకుండా సాధించుకున్న భారతదేశంలో ఇటువంటి దుర్భరపరిస్థితి నెలకొందన్నారు. జన్మభూమి కమిటీల వలన లబ్దిదారులకు కనీస ప్రభుత్వ పథకాలు అందడం వైఫల్యంచెందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్థశాస్త్ర ఆచార్యులు బోడేపూడి ప్రసాద్‌రావు, సిపిఎం మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, సీపీఐ నాయకులు దేవరకొండ మార్కెండేయులు, రాష్ట్ర పంచాయితీ విభాగం అధ్యక్షుడు యస్.సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేజోన్ ఏర్పాటు చేయాలి

ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాలు

దాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్ : విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నుంచి గురజాడ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉత్తరాం ధ్ర ప్రజల చిరకాల వాంఛ అయిన రైల్వేజోన్‌పై కేంద్ర ప్రభుత్వం నీళ్లు చల్లిందన్నారు. విశాఖకు రైల్వేజోన్ ఇవ్వడం కుదరదని, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో రైల్వేజోన్ అంశం పొందు పరచలేదని అన్నారు. గత ఎన్నికల్లో ఎంపీ హరిబాబు తనను గెలిపిస్తే విశాఖకు రైల్వేజోన్ తీసుకు వస్తానని చెప్పి మాట తప్పారని ఆయన ప్రజలను మోసిగించిన తప్పిన ఎంపీ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంఘాలకు చెందిన సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా, రైల్వేజోన్ ప్రకటించాలి

- బీజేవైఎం నాయకులు ఆడారి కిషోర్‌కుమార్




గాంధీ విగ్రహం వద్ద దీక్ష చేస్తున్న బీజేవైఎం నాయకులు

దాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: కేంద్రప్రభుత్వ హామీలు అమలు చేస్తేనే రాష్ట్రంలో బీజేపీకి మనుగడ సాధ్యమని భారతీయ జనతా పార్టీ యువమోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు ఆడారి కిషోర్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ గాంధీ పార్కులో వున్న మహాత్మ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రజల ఆకాంక్ష దీక్షను చేపట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రం అందించిన పథకాలను ప్రజలు వద్దకు తీసుకువెళ్ళడం జరిగిందన్నారు. లబ్దిపొందిన వారే రాష్ట్రానికి రావాల్సిన నిధులు గురించి వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ శ్రేణులు అవమానాలకు గురౌవుతున్నారని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలతో సహా ప్రజలు ఆగ్రహంగా వున్నారని, తక్షణమే రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వేజోన్ ప్రకటించి, రాష్ట్రంలో బీజేపీ మనుగడను కాపాడాలని కేంద్రపెద్దలను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్. అప్పలరాజు, నగర మహిళా ఉపాధ్యక్షురాలు అరుణ కుమారి, గొలగాని సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : నందమూరి కళానికేతన్ ఆధ్వర్యం లో 29వ వార్డు అప్పయ్యమ్మ పేటలో ఎన్టీఆర్ విగ్రహానికి, చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నందమూరి కళానికేతన్ అధ్యక్షుడు సాడి కృష్ణ మాట్లాడుతూ అటు సినీకళాకారుడిగా అరుదైన చిత్రాలలో నటించి, ఇటు రాజకీయ నాయకునిగా తనదైన ప్రత్యేకతను చాటుకుని అందరి హృదయాలలో చెరగని ముద్రవేసుకున్న గొప్ప వ్యక్తి నందమూరి తారకరామారావు అని పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండాజాతీయ రాజకీయాల్లోను తన ముద్రను చాటుకున్నారని చెప్పారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఎంతో మంది నాయకులకు స్ఫూర్తిగా నిలిచారని ఆయన అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని బీజేపీ ప్రభుత్వం నెరవే ర్చలేదని అన్నారు. ప్రత్యేక హోదా, రైల్వేజోన్, ఇతర హామీల సాధన కోసం చంద్రబాబు నాయుడు చేస్తున్న పోరాటం స్ఫూర్తిదాయకం అన్నారు. తెలుగుదేశం పార్టీ పెట్టిన అవిశ్వాస తీర్మానానికి పలు జాతీయ పార్టీలు మద్దతు ఇవ్వడం శుభపరిణామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నందమూరి అభిమానులు వేగి రాధాకృష్ణ, వీవీఎస్.మూర్తి, పాలు సత్యనారాయణ, కోలా చిన్నారావు, గంటు తాతారావు, బి.సన్యాసిరావు, ఎల్లపు శ్రీను, సైకిల్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సౌండి కులస్తులను ఓబీసీలో చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం సభ్యులు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : బీసీడీలో వున్న సొండికులస్తులను ఓబీసీలో చేర్చాలనే ప్రయత్నానికి ఎంతో మంది ప్రముఖులకు ధన్యవాదాలని ఏపీ సొండికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నీలకంఠం తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సొండి కులస్తులను బీసీడీలో చేర్చిందని దాని వలను అప్పటి కాంగ్రెస్ ప్రభు త్వానికి తమ కులస్తుల మద్దతు లభించిందని అలాగే తెలుగుదేశం ప్రభుత్వం కూడా తమను బీసీడీ నుంచి ఓబీసీలోకి చేర్చాలని వారు కోరారు. ఈ విష యమై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి రాష్ట్ర రాజధాని అమ రావతి వినతి పత్రం కూడా అందించడం జరిగిందని ఆయన తెలిపా రు.ఈ కార్యక్రమంలో ఆర్ నాగేశ్వరరావు, ఎల్.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నంత పనే జరిగింది

(మొదటిపేజీ తరువాయి)

బోర్డు ఏర్పాటు చేయాలని అన్నాడీఎంకే, రిజర్వేషన్ల పెంపు అంశంపై తెరాస సభ్యులు స్పీకర్ వెల్‌లోకి ప్రవేశించి నినాదాలు చేశారు. వారి ఆందోళన మధ్యే స్పీకర్ కాసేపు ప్రశ్నోత్తరాలు నిర్వహించారు.

ప్రభుత్వం అన్ని అంశాలపై చర్చకు సిద్ధంగా ఉందని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ లోక్‌సభలో స్పష్టం చేశారు. విపక్ష సభ్యులు ఆందోళన విరమించి సభ సక్రమంగా జరిగేందుకు సహకరించాలని ఆయన కూడా కోరారు. అయినప్పటికీ సభ్యులు శాంతించలేదు. బిగ్గరగా నినాదాలు చేయడంతో సభ నినాదాలతో దద్దరిల్లిపోయింది. సభ సజావుగా సాగేందుకు సభ్యులు సహకరించాలని.. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించేందుకు సభ్యులు వీలు కల్పించాలని స్పీకర్ కోరినా వారు వినిపించుకోలేదు. దీంతో సభను మంగళవారం వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించారు.అలాగే రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. రాజ్యసభలో ఏపీతో పాటు , వివిధ రాష్ట్రాలకు చెందిన సభ్యులు వారి వారి సమస్యలపై ఆందోళనకు దిగారు. దీంతో సభ ప్రారంభమై నిమిషాల వ్యవధిలోనే సభను మంగళవారంకు వాయిదా వేస్తున్నట్లు రాజ్యసభ ఛైర్మన్ ఎం. వెంకయ్యనాయుడు ప్రకటించారు.దీంతో తెలుగుదేశం, వైఎస్ఆర్‌సీపీ సభ్యులకు నిరాశకు గురిచేసింది. ఇప్పటికే దేశంలో వివిధ పార్టీల మద్దతు కూడగట్టుకున్న టీడీపీ, వైసీపీ అవిశ్వాసం ఖాయమని భావించినప్పటికీ, టీఆర్ఎస్, అన్నాడీఎంకే సభ్యుల ఆందోళన మూలంగా అవిశ్వాసం చర్చకు నోచుకోకొగా ఉభయ సభలు వాయిదా పడ్డాయి.

మళ్లీ నోటీసులిచ్చిన వైఎస్సార్‌సీపీ

(మొదటిపేజీ తరువాయి)

నోటీసులు అందజేశారు. ఇంతకు ముందు రెండు సార్లు ఇచ్చిన నోటీసులపై సభలో చర్చ జరగని కారణంగా.. మూడోసారి నోటీసులు ఇవ్వడం అనివార్యమైందని ఆ పార్టీ ఎంపీలు చెప్పారు.

150 మంది లేచి నిలబడ్డారు: వైవీ

కేంద్ర ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానానికి లోక్‌సభలో అనూహ్య మద్దతు లభించిందని ఆ పార్టీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. సభ వాయిదా అనంతరం వైఎస్సార్‌సీపీ ఎంపీలు మీడియాతో మాట్లాడారు. "స్పీకర్‌గారు అవిశ్వాస తీర్మానం నోటీసులను చదివినతర్వాత 150 మందిదాకా ఎంపీలు లేచి నిలబడ్డారు. అయితే అప్పటికే పోడియం దగ్గర కొన్ని పార్టీలు ఆందోళన చేస్తున్నాయి. సభ ఆర్డర్‌లో లేనికారణంగా చర్చను చేపట్టలేకపోతున్నట్లు స్పీకర్ చెప్పారు. గందరగోళ పరిస్థితుల్లోనే ఆర్థిక బిల్లులు ఆమోదించుకున్నారే, మరి అవిశ్వాసంపై చర్చను మాత్రం వాయిదా వేయడం ఎంతవరకు సబబు? స్పీకర్, కేంద్రం తీరును మేం నిరసిస్తున్నాం. నేను స్పీకర్ ఇచ్చే విందును కూడా వైఎస్సార్‌సీపీ బహిష్కరిస్తున్నది. చర్చ జరిగే వరకూ నోటీసులు ఇస్తూనేఉంటాం..' అని వైవీ సుబ్బారెడ్డి చెప్పారు.

ఆర్టీసీకి ప్రైవేటు

(మొదటిపేజీ తరువాయి)

ఉంది. విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలలోనే ప్రైవేటు ఆపరేటర్లు తమ కార్యాలయాలను కొనసాగిస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటలయ్యిందంటే ప్రైవేటు వాహనాలు బస్సులే బారులు తీరతాయి. రాత్రి పది గంటల వరకు ఈ తంతు జరుగుతుంది. సాయంత్రం 5 గంటల నుంచి ప్రైవేటు వాహనాలు రోడ్డుపక్కనే వరుసగా నిలిపివుంటాయి. దూరప్రయాణం చేయాలంటే ఆర్టీసీ బస్సుల జోలికి ఎవరూ వెళ్లరు. విజయవాడ నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రైవేటు బస్సులే సౌకర్యాలు, సౌకర్యం. దీనికి కారణం లేకపోలేదు. ఆర్టీసీ అధికారులు సుదూర ప్రాంతాలకు బస్సులు నడపడం లేదు. ఒకవేళ నడిపినా ఒకటి, రెండు మాత్రమే. ప్రైవేటువారిని చూసి నేర్చుకోవల్సింది చాలా ఉన్నా ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సుదూర ప్రాంతాలకు బస్సులు వేస్తే ప్రైవేటు ఆగడాలను నియంత్రించవచ్చునని ఎవరైనా సలహా ఇస్తే ఆదాయం రాదని కొట్టిపారేస్తారు. అదే ప్రైవేటు బస్సులు రోజుకి 50కి పైగానే సుదూర ప్రాంతాలకు వెళుతుంటాయి. బహుశా తాము బస్సులు వేస్తే ప్రైవేటువారికి వ్యాపారం జరగదేమోనన్న ఆలోచనతో ఆర్టీసీ అధికారులు బస్సులు వేయడం లేదేమోనన్న అనుమానం కలుగకమానదు. ఎందుకంటే సాయంత్రం 5 గంటల నుంచి ఎల్‌ఐసి కార్యాలయం మొదలుకొని మద్దిలపాలెం జంక్షన్ వరకు అనేక ప్రైవేటు వాహనాలు ప్రతి నిమిషానికి ఒకటి చొప్పున బయలుదేరి వెళుతుంటాయి. ఈ బస్సులలో ప్రయాణించేందుకు వందల సంఖ్యలో ప్రయాణీకులు పడిగాపులు కాస్తుంటారు. ఇవన్నీ తమ కంటిముందే జరుగుతున్నా అధికారుల దృష్టికి ఎందుకు వెళ్లడం లేదో బోధపడదం లేదు. పైగా యథేచ్ఛగా ప్రైవేటు వాహనాలు ప్రయాణీకులను ఎక్కించుకుని వెళుతుంటే ఆర్టీసీ అధికారులు చోద్యం చూడడం గమనార్హం. ఇంకో విశేషం ఏమిటంటే ఎల్‌ఐసి కార్యాలయం ప్రక్కనే ప్రైవేటు వాహనాలు అనేకం పార్కింగ్ చేసి ప్రయాణానికి సిద్ధంగా ఉంటాయి, వీటి జోలికి ఎవరూ వెళ్లరు. విచిత్రం ఏమిటంటే ప్రయాణీకులు కూడా సుదూర ప్రాంతం అనగానే ఆర్టీసీతో దండం అంటారు. భూమండలంలోని ప్రజలందరికీ తామే రవాణా సౌకర్యం కల్పిస్తున్నంతగా ఆర్టీసీ అధికారులు ప్రకటనలు గుప్పిస్తుంటారు. ఒకచిన్న కార్యక్రమానికి మీడియాని పిలిచి లేకత్వమైన హంగామా చేస్తారు. కానీ ప్రయాణీకులకు అనుకూలమైన విధంగా బస్సులను వేయడం కానీ, నిర్వహించడం కానీ చేపట్టరు. అదేవిధంగా ఆర్టీసీ కార్మిక సంఘాలు తమ హక్కుల కోసం ప్రతిరోజు ధర్నాలు చేస్తారు కానీ, ఏ ఒక్క కార్మిక సంఘం నాయకుడు కూడా తమ అధికారులను మేల్కొలిపే ప్రయత్నం చేయరు. ప్రైవేటు ఆపరేటర్ల ఆగడాలను అరికట్టేందుకు పోరాట మాపరు.

రవాణాశాఖ ఉన్నట్టా.. లేనట్టా..?

ఇంత జరుగుతున్నా రవాణాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లే వ్యవహరిస్తున్నారు. సుదూర ప్రాంతాలకు ప్రయాణీకులను తీసుకెళ్లేందుకు ఓల్వోబస్సులు తిరుగుతున్నప్పటికీ వాటికి సంబంధించిన అధికారిక తనిఖీలు ఎక్కడా కనిపించవు.

రాష్ట్రంలో ఎక్కడో ఏ ఓల్వోబస్సో ప్రమాదానికి గురై ఓ పదిమంది చనిపోతే తప్ప రవాణాశాఖాధికారులు ఓ రెండురోజులు హడావిడి చేసి చేతులు దులుపుకుంటారు. ప్రయాణీకుల రవాణాతో పాటు సరుకు రవాణా కూడా ప్రైవేటు ఆపరేటర్లే నిర్వహిస్తున్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేటు బస్సుల్లోనే సరుకు రవాణా అవుతోంది. ఈ బస్సులు కూడా ఆర్టీసీ కాంప్లెక్స్‌ముందే నిలబడి సరుకు ఎక్కించుకుంటారు. అలాగే సరుకు కూడా దిగుమతి చేస్తారు. అయినప్పటికీ అటు ఆర్టీసీ అధికారులు కానీ, ఇటు రవాణాశాఖాధికారులు కానీ ఏమీ మాట్లాడరు. మరో విశేషం ఏమిటంటే ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలోనే బిఎస్‌ఆర్ మార్కెట్‌లో ప్రైవేటు వ్యవస్థలు ఇక్కడి ముఖ్యంగా సరుకు రవాణా సంస్థలను నెలకొల్పాయి. ఏకంగా ఓల్వో బస్సులే ఈ సరుకులను ప్రతిరోజు సుదూర ప్రాంతాలకు మోసుకెళ్తుంటాయి. ఇటీవల కాలంలో ఆర్టీసీ స్వయంగా పార్శిల్ సేవలను ప్రారంభించింది. ప్రైవేటు ఆపరేటర్లతో ఆర్టీసీ ఆదాయానికి అటు ప్రయాణీకుల పరంగా, ఇటు సరుకుల పరంగా గండిపడుతూనే ఉంది. మరో విశేషం ఏమిటంటే ప్రతిరోజు సాయంత్రం 5 గంటలు నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రైవేటు ఓల్వో బస్సులు ఎల్‌ఐసి కార్యాలయం నుంచి మద్దిలపాలెం జంక్షన్ వరకు ఎక్కడబడితే అక్కడ అవి తమదని దాము చేసుకుంటూ ఉంటాయి. అయినప్పటికీ కూడా ట్రాఫిక్ పోలీసులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడం గమనార్హం.

విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : అనిమోల్ సంస్థ సహకారంతో అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నక్కవానిపాలెం పరిధిలో గల వివిధ పాఠశాలలో పిల్లలకు భోజనంతో పాటు అదనంగా బిస్కెట్ ప్యాకెట్లు అందిస్తుందని జీత మిత్ర దాస స్వామిజీ అన్నారు. తమ సంస్థలకు అన్ని విధాలుగా సహకారం అందిస్తున్న అనిమోల్ సంస్థ కు సామాజిక సేవా విభాగం ప్రతినిధులకు అక్షయ పాత్ర ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీనివాసదాస ధన్యవాద ప్రకటిస్తూ భవిష్యత్‌లో కూడా వారి సహాయ సహ కారాలను ఈ విధంగా అందించ గలరని విజ్ఞప్తి చేసినారు. ఈకార్యక్రమంలో జీతమిత్ర దాస స్వామిజీ కె.అరుణ కుమారి, కె .బసవ పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

దౌత్య వివాదం

అరువై ఏండ్లు దాటిన వృద్ధులను, మతిస్థిమితం కోల్పో యిన వారిని విడుదల చేసుకోవాలని ఇటీవల విదేశాంగమంత్రి సుష్మా స్వరాజ్ ప్రతిపాదించారు. దీనికి పాకిస్థాన్ విదేశాంగ మంత్రి అనుకూలంగా స్పందించారు. అరువై ఏండ్లు దాటితే విడుదల చేయాలని,పద్దెనిమిది ఏండ్ల లోపు పిల్లలను కూడా విడుదల చేసుకోవాలని ఆయన సూచించారు. జుడిషియల్ కమిటీ విధానాన్ని పునరుద్ధరించుకోవడా నికి ఇరుదేశాలూ అంగీకరించాయి. ఇటువంటి సుహృద్భావం వెల్లివిరుస్తున్న తరుణంలో దౌత్యవేత్తల వేధింపుల వివాదం చెలరేగకపోవలసింది. భారత పాకిస్థాన్ దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడుతున్న సూచనలు కనిపిస్తున్న దశ లో మళ్ళా ఉద్రిక్తతలు రగులడం విచారకరం. వృద్ధులు, పిల్లలు, మతిస్థిమితంలేని ఖైదీలను పరస్పరం విడుదల చేసుకోవాలని రెండు దేశాలు ఇటీవలే అంగీకరించాయి. ఈ సుహృద్భావం నెలకొన్న తరుణంలో దౌత్యవేత్తల వేధింపుల వివాదం పెచ్చరిల్లడం ఆందోళన కలిగిస్తున్నది. ఢిల్లీలోని తమ దౌత్యవేత్తలను, వారి కుటుంబాలను వేధిస్తున్నారంటూ ఆరోపించిన పాకిస్థాన్ సంప్రదింపుల కోసం తమ రాయబారిని పిలిపించుకున్నది. భారత్ కూడా పాకిస్థాన్‌పై ఇటువంటి ఆరోపణలే చేస్తున్నది. ఇస్లామాబాద్‌లోని తమ దౌత్యవేత్తలను, వారి కుటుంబాలను వేధిస్తూ, మరోవైపు తామే బాధితులం అన్నట్టుగా పాకిస్థాన్ చెప్పుకుంటున్నదని భారత్ ప్రత్యారోపణలు చేసింది. దాదాపు రెండు నెలలుగా రెండు దేశాలు ఆరోపణలు చేసుకుంటున్నాయి. వారం రోజులుగా వేధింపులు ఎక్కువయ్యాయని ఇరుపక్షాలూ అంటున్నాయి. శత్రు దేశానికి చెందిన వారయినా సరే, రాయబారికి భద్రత కల్పించడం రాజనీతి. దౌత్యవేత్తలకు అనేక విధా ల మినహాయింపులు కూడా ఉంటాయి. 1961 నాటి వియెన్నా ఒడంబడిక దౌత్య సంబంధా ల నిర్వచించింది. శత్రుదేశాల మధ్య అయినా, యుద్ధ సమయంలోనైనా దౌత్య మర్యాదలు పాటించడం ధర్మం. అంతర్జాతీయ న్యాయసూత్రాలు బలపడి, దౌత్యవేత్తలను ఆదరించాలనే సంస్కృతి బలపడిన నేటికాలంలో ఇంకా దౌత్యవేత్తల వేధింపుల ఆరోపణలు రావడం రెండు దేశాల మధ్య దిగజారిన సంబంధాలను సూచిస్తున్నాయి. అత్యవసరమైతే తప్ప, రాయబార కార్యాలయ ప్రాంతం నుంచి బయటకు వెళ్లకండి. దౌత్యసంబంధ నెంబర్ గుర్తింపు ఉన్న వాహనాలలోనే వెళ్ళండి తప్ప ఇతర వాహనాలు వాడవద్దు- ఇదీ భారత విదేశాంగశాఖ ఇస్లామాబాద్‌లోని దౌత్యవేత్తలకు చేసిన తాజా హెచ్చరిక. పాకిస్థాన్‌లో తమ ను, తమ కుటుంబాలను తీవ్రంగా వేధిస్తున్నారని భారత దౌత్యవేత్తలు ఆరోపిస్తున్నారు. అర్ధరాత్రి మూడు గంటల సమయంలో అగంతకులు వచ్చి ఇంటి తలుపు తట్టడం, కారులో వెళుతున్నవారిని వెంటాడటం, వీధుల్లో గుర్తుతెలువని వ్యక్తులు అడ్డుపడి కాయించుకొని లొల్లి పెట్టుకోవడం మొదలైన రీతుల్లో వేధిస్తున్నారని దౌత్యవేత్తలు ఆరోపిస్తున్నారు. భారత దౌత్యవేత్తల నివాసాలకు విద్యు త్, నీటి సరఫరాను నిలిపివేశారనేది మరో తీవ్ర ఆరోపణ. భారత కార్యాలయ భవన నిర్మాణ కార్మికులను కూడా వేధిస్తున్న ఆరోపణ ఉన్నది. ఢిల్లీలో ని పాకిస్థాన్ దౌత్యవేత్తలు కూడా వేధింపు ఆరోపణలు చేస్తున్నారు. బడికిపోతున్న తమ పిల్లలను కూడా అటకాయించారని వారు ఆరోపించారు. తమ దౌత్యవేత్తను వేధిస్తున్న వీడియో దృశ్యాలను పాకిస్థాన్ విడుదల చేసింది. దౌత్యవేత్త వాహనం ముందు మరొకరి కారు మెల్లగా నడుస్తూ అడ్డుకోవడం, ఇరువైపులా ద్విచక్రవాహనాలపై గుర్తుతెలియని వ్యక్తులు వెంటపడటం ఈ దృశ్యాలలో ఉంది. తమ వాహనాలను సోదా చేస్తున్నారని కూడా పాకిస్థాన్ అంటున్నది. ఈ వేధింపులను ఆపకపోతే దౌత్యవేత్తలను, వారి కుటుంబాలను వెనుకకు పిలిపించుకుంటామని హెచ్చరించింది. క్లబ్బుల సభ్యత్వం గొడవ రెండు నెలలుగా సాగుతున్నది. ఢిల్లీలోని క్లబ్బుల లో తమ దౌత్యవేత్తలకు పది రెట్లు ఎక్కువ వసూలు చేస్తున్నారని పాకిస్థాన్ ఆరోపించింది. ఇస్లామాబాద్ క్లబ్బుల్లో తమ దౌత్యవేత్తలకు సభ్యత్వం ఇవ్వడం లేదని భారత్ అంటున్నది. కశ్మీర్ ప్రాంతంలోని అధీన రేఖ దగ్గర ఉద్రిక్తత ఇంకా సడలనే లేదు. అయినా సరే, ఇటీవల రెండు దేశాల జైళ్ళలో మగ్గుతున్న పౌర ఖైదీలను విడుదల చేసుకునే విషయమై ముంద డుగు పడ్డది. అరువై ఏండ్లు దాటిన వృద్ధులను, మతస్థిమితం కోల్పోయిన వారిని విడుదల చేసుకోవాలని ఇటీవల విదేశాంగమంత్రి సుష్మా స్వరాజ్ ప్రతిపాదించారు. దీనికి పాకిస్థాన్ విదేశాంగ మంత్రి అనుకూలంగా స్పం దించారు. అరువై ఏండ్లు దాటితే విడుదల చేయాలని, పద్దెనిమిది ఏండ్ల లోపు పిల్లలను కూడా విడుదల చేసుకోవాలని ఆయన సూచించారు. జుడిషియల్ కమిటీ విధానాన్ని పునరుద్ధరించుకోవడానికి ఇరుదేశాలూ అంగీకరించాయి. ఇటువంటి సుహృద్భావం వెల్లివిరుస్తున్న తరుణంలో దౌత్యవేత్తల వేధింపుల వివాదం చెలరేగకపోవలసింది. రెండు పక్షా లు కోరుకున్నపుడే సత్సంబంధాలు నెలకొంటాయి. ఏ ఒక్క దేశం తుంటరి పనికి దిగినా కయ్యం తప్పదు. సాధారణంగా దౌత్య సంబంధాలలో దెబ్బకు దెబ్బ సూత్రం అమలవుతూ ఉంటుంది. ఒకరు దౌత్యవేత్తను వేధిస్తే, ఎదుటి పక్షం కూడా అదేరీతిలో స్పందిస్తుంది. కూరి మి గల దినములలో నేరము లెన్నడును కలుగ నేరవు.. మరియా కూరిమి విరసంబైన నేరములే తోచుచుండు నిక్కము సుమతీ అన్నట్టుగా మంచి సంబంధాలుంటే, అపార్థాలకు తావుం డదు. ఏదైనా అవాంఛనీయ ఘటన చోటుచేసుకుంటే, కలిసి చర్చించుకొని పరిష్కరించుకుంటాయి. పాకిస్థాన్ ఇంకా సైనిక ప్రభావంలో ఉన్న దేశం. పెద్ద దేశాల ప్రభావం నుంచి బయటపడలేదు. భారత్ చుట్టూరా దేశాలను ప్రభావితం చేయాలని చైనా ప్రయత్నిస్తున్నది. ఈ నేపథ్యంలో, పాకిస్థాన్‌తో భారత్ నేర్పుగా వ్యవహరించాలె. తాజా వివాదాలను పరిష్కరించుకొని సత్సంబంధాలను వృద్ధి చేసుకోవడం రెండు దేశాలకూ మంచిది.

బీజేపీ కళ్లు తెరుస్తుందా?

ఉప ఎన్నికలు జరిగినప్పుడు సర్వసాధారణంగా పాలకపక్షాలే గెలుస్తాయి. కానీ ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు బీజేపీ, జేడీ (యూ) లకు షాకిచ్చాయి. త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సాధించిన ఘన విజయాన్ని ఆవిరిచేశాయి. ఉత్తరప్రదేశ్‌లో ఉప ఎన్నికలు జరిగిన రెండు లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ ఓడిపోయింది. బిహార్‌లో ఉప ఎన్నిక జరిగిన ఒక లోక్‌సభ స్థానాన్ని లాలూ ప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని ఆర్జేడీ గెల్చుకోగా, రెండు అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ఆర్జేడీ, బీజేపీ చెరొకటీ గెల్చుకున్నాయి. ఈ ఉప ఎన్నికలు అనేక విధాల కీలకమైనవి. యూపీలోని గోరఖ్‌పూర్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సొంత స్థానం.

ఆయన గోరఖ్‌పూర్ మఠం ప్రధాన పూజారిగా ఉంటూ ఇక్కడ అయిదు దఫాలు విజయం సాధించారు. అంతక్రితం కూడా ఆ మఠం ప్రధాన పూజారులే విజేతలు. వెరసి ముప్పై ఏళ్లుగా అది బీజేపీదే. మరో స్థానం ఫుల్పూర్ 2014లో తొలిసారి బీజేపీ గెలిచిన స్థానం గనుక అక్కడ ఇప్పుడెదురైన ఓటమి ఆ పార్టీని పెద్దగా బాధించదు. ఇక బిహార్‌లో లాలూ జైల్లో ఉన్నా ఆయన తనయుడు తేజస్వియాదవ్ గట్టిగా కృషి చేసి తమ పార్టీ స్థానాలను నిలబెట్టుకోగలిగారు.

ఉప ఎన్నికల ఫలితాలు ప్రతికూలంగా రావడం బీజేపీకి ఇది మొదటిసారేమీ కాదు. గత సార్వత్రిక ఎన్నికలు జరిగిన నాలుగు నెలల తర్వాత పది రాష్ట్రాల్లో మూడు లోక్‌సభ స్థానాలకూ, 33 అసెంబ్లీ స్థానాలకూ జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ సగం స్థానాలు పోగొట్టుకుంది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్‌లలో ఆ పార్టీకి ప్రతికూల ఫలితాలొచ్చాయి. ఈమధ్య రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో జరి గిన ఉప ఎన్నికల్లో సైతం అదే జరిగింది. ఏ పార్టీకైనా ఎన్నికల్లో గెలుపు అర్థమైనం తగా ఓటమి అర్థంకాదు. ఎందుకంటే ఓటమి అనాథ. ఎవరికి వారు నెపాన్ని ఎదుటివారిపైకి నెట్టే యత్నం చేస్తారు. అందువల్ల ఇప్పుడెదురైన చేదు అనుభవానికి కారణాలేమిటో అర్థం కావడానికి బీజేపీకి మరికొంత సమయం పడుతుంది.

నిజా నికి ఉప ఎన్నికలను పాలకపక్షాలు పెద్దగా పట్టించుకునేవి కాదు. అక్కడ గెలిచినా, ఓడినా అదనంగా ఒరిగేదేమిటని అనుకునేవి. కానీ ప్రధాని




నరేంద్ర మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాల సారథ్యం మొదలయ్యాక పంచాయతీ నుంచి పార్లమెంటు వరకూ బీజేపీ ప్రతి ఎన్నికనూ తీవ్రంగా తీసుకుంటోంది. ఉప ఎన్నికలను కూడా వదలడం లేదు. ప్రస్తుత ఉపఎన్నికలనూ అలాగే భావించింది. కనుకనే ఇప్పుడు వెల్లడైన ఫలితాలు ఆ పార్టీని కుంగదీస్తున్నాయి. 2014 సార్వత్రిక ఎన్నికల్లో యూపీలో ఉన్న 80 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ 71 గెల్చుకుంది. మోదీ ఆ రాష్ట్రంలోని వారణాసి స్థానం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. అలాగే సరిగ్గా సంవత్సరం క్రితం అక్కడి అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో 403 స్థానాలకు 312 సాధించింది.

ఇలాంటి రాష్ట్రంలో మూడు దశాబ్దాలుగా గెల్చుకుంటున్న లోక్‌సభ స్థానాన్ని, అందునా మొన్నటివరకూ సీఎం ప్రాతినిధ్యం వహించిన స్థానాన్ని చేజార్చుకోవడం చిన్న విషయం కాదు. సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్‌పీలు ఏకమవుతాయనిగానీ... ఏక మైనా ఇంతటి ప్రభావం చూపగలవనిగానీ తాము అనుకోలేదని, అతి విశ్వాసమే దెబ్బతీసిందని బీజేపీ నేతలు చెబుతున్నారు. కానీ గత ఎన్నికల్లో పోలైన ఓట్లలో 50 శాతం బీజేపీ ఖాతాలో పడ్డాయి. ఆ రెండు పార్టీల ఓట్లనూ కలిపి లెక్కేసినా బీజేపీ కన్నా అవి చాలా దూరంలో ఉన్నాయి.

ఆ ఓట్లన్నీ ఇప్పుడెందుకు గల్లంతయ్యాయి? బీఎస్‌పీ నేత మాయావతి వ్యూహాత్మకంగా ఎన్నికల బరి నుంచి తప్పుకుని ప్రధాన శత్రువుగా భావించే ఎస్‌పీకి మద్దతు ప్రకటించడం ఉప ఎన్నికల ముఖచిత్రాన్నే మార్చేసింది. దళిత ఓటర్లు మాయావతి పిలుపు అందుకుని మూకుమ్మడిగా ఎస్‌పీకి ఓట్లేశారని ఫలితాలు వెల్లడిస్తున్నాయి. అలాగే ఎన్నికల్లో యాదవులకే పెద్దపీట వేసే అలవాటున్న ఎస్‌పీ ఈసారి రెండు స్థానాలనూ ఓబీసీలకు కేటాయించడం కూడా గెలుపునకు దోహద పడింది. వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లో రెండు పార్టీలూ చేతులు కలిపితే బీజేపీ కంగారుపడక తప్పదు.

బిహార్ ఉప ఎన్నికలు సైతం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, జేడీ(యూ)నేత నితీష్ కుమార్‌తోపాటు బీజేపీ పెద్దల్ని కూడా నిరాశపరిచాయి. 2015లో జేడీ(యూ), ఆర్జేడీ, కాంగ్రెస్‌ల కూటమి బీజేపీని ఓడించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా...ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో ఆ కూటమినుంచి నితీష్ వైదొలగి, సీఎం పదవికి రాజీనామా చేసి, విపక్షంలో ఉన్న బీజేపీతో చేతులు కలిపి కొత్త ప్రభుత్వానికి సార థ్యంవహించడం మొదలెట్టారు. పైగా రెండు కేసుల్లో దోషిగా తేలి లాలూ జైల్లో ఉన్నారు. ఆయన కుటుంబసభ్యులందరూ అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్నారు. లాలూ కుమారుడు తేజస్వియాదవ్ ఎన్నికల పోరులో అనుభవమున్న వ్యక్తి కాదు. కనుక ఈ ఉప ఎన్నికలో గెలుపు ఖాయమని అధికార కూటమి భావించింది. కానీ ఓటర్లు వేరేలా తలిచారు. కొత్తగా అధికారంలోకొచ్చే ప్రభుత్వాలు మెరుగైన, సమర్ధవంతమైన పాలన అందించడానికి బదులు పోలీసులకు విస్తృతాధికారాలిస్తాయి. వారు చేసే హడా వుడి కారణంగా ప్రభుత్వం చాలా చురుగ్గా ఉన్నట్టు అందరూ భావిస్తారని పాలకుల విశ్వాసం. యోగి ఆదిత్యనాథ్ కూడా దీన్ని తుచ తప్పకుండా పాటించారు. పోలీ సులు ముందుగా ప్రేమికులపై ప్రతాపం చూపడం ప్రారంభించారు. ఆ తర్వాత ఈవ్‌టీజింగ్‌ను కట్టడి చేసే పేరుతో నడి బజారుల్లో అతిగా ప్రవర్తించారు. నేర స్తులను అరికట్టే పేరిట ఏకంగా వరస ఎన్‌కౌంటర్లకు దిగారు. యోగి అధికారం స్వీకరించాక ఏడాది వ్యవధిలో 1,142 ఎన్‌కౌంటర్లు జరిగాయి. వీటిల్లో 38మంది చనిపోయారు. ప్రతి ఎన్‌కౌంటర్‌కూ వేర్వేరు కథలు వినిపించే ఓపిక లేక కాబోలు ఒకే మాదిరి కథనాన్ని 9 ఎఫ్‌ఐఆర్‌లలో చేర్చారు. నేరాన్ని కట్టడి చేసే పేరుతో ప్రభుత్వమే ఇలా చట్టవిరుద్ధమైన పనులకు పాల్పడ టాన్ని జనం మెచ్చరు. ఇలాంటి వన్నీ యోగి పాలనను పలచన చేశాయి. ఈ ఉప ఎన్నికలను హెచ్చరికగా భావించి లోపాలను సరిదిద్దుకోనట్టయితే, విపక్షాలను తక్కువగా అంచనా వేస్తే వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ ఏటికి ఎదురీదాల్సిన పరిస్థితుల్లో పడొచ్చు.

బుద్ధుడు సందేశాలు



స్త్రీలూ - సంఘం

లోగడ యశోధర తనను కూడా సంఘంలో చేర్చుకోవలసిందని బుద్ధుడిని మూడుసార్లు అర్థించింది. కాని బుద్ధుడు ఆమె కోరికను మన్నించలేదు. ఇప్పుడు పంఎపుడు తల్లి ప్రజాపతి, యశోధరను, ఇంకా అనేక మంది స్త్రీలను తీసుకొని తథాగతుని వద్దకు వెళ్ళి వీళ్ళందరికి దీక్ష ఇచ్చి శిష్యులుగా సంఘంలో చేర్చుకొమ్మని మనస్ఫూర్తిగా కోరింది. సంఘంలో స్త్రీలను చేర్చుకొంటే వచ్చే అనర్థాలను ఊహించి, బుద్ధుడు ఇది తగని పని, ఇందువల్ల వెయ్యేళ్ళు మనవలసిన ఈ మతం, 500 ఏళ్ళకే సంఘంలో చేరి ఆధ్యాత్మ జీవితం గడపాలనే వారి ఉత్సాహాన్ని కాదనలేక, వారినందరిని శిష్యులుగా చేర్చుకొనడానికి అంగీకరించారు.

అప్పుడు పూజనీయుడైన ఆనందుడు బుద్ధునితో ఇలా అన్నాడు. మహాత్మా! స్త్రీలు ఇళ్ళూ వాకిళ్ళూ వదిలి, తథాగతుడు బోధించినట్లుగా ఆయన సిద్ధాంతం, క్రమశిక్షణ పాటించి, సంచార జీవితం గడపడం సాధ్యమవుతుందా? బౌద్ధ ధర్మాన్ని స్వీకరించిన ఫలితం వారికి లభిస్తుందా? జనన మరణ చక్రం నుంచి విముక్తి పొందగలరా? రుషులు కాగలరా? బుద్ధుడు ఆ ప్రశ్నకు సమాధానమిస్తూ ఇలా చెప్పాడు. ఆనందా! స్త్రీలు అన్నిటికీ సమర్థులే. బౌద్ధ ధర్మాన్ని స్వీకరించి సంఘంలో చేరి క్రమశిక్షణతో సాధన చేస్తే సత్ఫలితాలు పొందుతారు. జనన మరణ వలయాన్ని ఛేదించుకొని, సంసార సాగరాన్ని తరిస్తారు. ముక్తిని పొందగలరు. మహర్షులూ కాగలరు. ఆనందా! ఆలోచించు. ప్రజాపతి ఔదార్యం, దాతృత్వం ఎంత ఘనమైనవో జ్ఞాపకం తెచ్చుకో, బుద్ధుని తల్లికి ఆమె సోదరి. తల్లి మరణించగా బాలుడైన సిద్ధార్థుని ఆమె పెంచి పెద్ద చేసింది. ఆలనా పాలనా చూచింది. కాబట్టి స్త్రీలు సర్వ సమర్థులు. సంఘంలో చేరి సాధన చేయవచ్చు. ఇళ్ళు విడిచి భిక్షుణులై సంచార జీవితం గడపవచ్చు. ఆవిధంగా స్త్రీలకు సంఘంలో స్థానం లభించింది. ప్రజాపతి బుద్ధునికి ప్రథమ శిష్యురాలు అయ్యింది. భిక్షుణిగా దీక్ష చేపట్టింది.

తదనంతరం భిక్షువులు బుద్ధుని సమీపించి ఇలా అడిగారు. ఓ తథాగతా! ప్రభూ సర్వసంగ పరిత్యాగులైన శ్రమణులు, స్త్రీల పట్ల ఎలా ప్రవర్తించాలో నిర్దేశించండి. అందుకు బుద్ధుడు సమాధానం చెబుతూ ఇలా ఉపదేశించాడు. స్త్రీని చూసే విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

దిన ఫలాలు

మంగళవారం -20-3-2018

మేషం: ఆర్థికపరిస్థితి అంతంతమాత్రంగానే ఉంటుంది. చేపట్టిన పనులు సన్నిహితుల సహాయంతో పూర్తిచేస్తారు. ఆరోగ్యం పట్ల, వాహనాలు నడిపే విషయంలో నిర్లక్ష్యం తగదు.

వృషభం: కుటుంబసభ్యులతో కలిసి ఉల్లాసంగా గడుపుతారు, దీర్ఘకాలిక సమస్యల నుంచి బయటపడతారు. వివాదాలకు దూరంగా ఉండటం ఉత్తమం.

మిథునం: ఆర్థికపరిస్థితి అంతంతమాత్రంగానే ఉంటుంది. కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. కీలక నిర్ణయాలు తీసుకుంటారు. సోదరుల నుంచి కీలక సమాచారం.

కర్కాటకం: కీలక సమయంలో కుటుంబసభ్యుల నుంచి సహాయసహకారాలు అందుతాయి. ఆర్థికలావాదేవీలు లాభి స్తాయి. భాగస్వామ్య వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

సింహం: రుణ ఒత్తిడి నుంచి బయటపడతారు. మిత్రులతో ఏర్పడిన వివాదాలను పరిష్కరించుకుంటారు. దూరప్రాం తాల నుంచి అందిన ఓ సమాచారం కుటుంబంలో సంతోషం.

కన్య: వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు. ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. అనుకోని ప్రయాణాలు లాభిస్తాయి. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

తుల: ఆర్థికలావాదేవీలు ఆశాజనకంగా ఉంటాయి. నూతన ప్రయత్నాలు అనుకూలిస్తాయి. దూరప్రాంతాల నుంచి అందిన ఓ వార్త సంతోషానికి కారణమవుతుంది.

వృశ్చికం: కుటుంబసభ్యులతో ఏర్పడిన వివాదాలను పరిష్కరించుకుంటారు. దూరప్రయాణాలు లాభిస్తాయి. వృత్తి, వ్యాపారాలలో స్వల్పలాభాలు పొందుతారు.

ధనస్సు: విందువినోదాలలో పాల్గొంటారు. ఉద్యోగులకు ప్రోత్సాహం లభిస్తుంది. విలువైన వస్తువులు, ఆభరణాలను కొనుగోలు చేస్తారు. సన్నిహితుల నుంచి విలువైన సమాచారం.

మకరం: రుణవిముక్తి లభిస్తుంది. ఉద్యోగులకు ఎదురుచూస్తోన్న పదోన్నతలు లభించే అవకాశం ఉంది. శుభవార్తలు వింటారు. సంఘంలో గౌరవం పొందుతారు.

కుంభం: నూతన ఉద్యోగావకాశాలు పొందుతారు. ప్రయాణాలలో కొత్త మిత్రులు పరిచయమవుతారు. బంధువులతో కలిసి సంతోషంగా గడుపుతారు. ఆకస్మిక ధనలాభం ఉంది.

మీనం: నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. చేపట్టిన పనులను సకాలంలో పూర్తిచేస్తారు. వాహన సౌఖ్యం ఉంది. దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం దొరకడంతో ఊరట.



మనం ఆరోగ్యంగా ఉండాలంటే అన్ని రకాల పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం తప్పనిసరి అని అందరికీ తెలుసు. అయితే పోషకాల్లో కార్బొహైడ్రేట్లు, ప్రోటీన్లు, ఫ్యాట్స్, మినరల్స్‌తోపాటు విటమిన్లు కూడా ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ క్రమంలోనే విటమిన్లన్నింటిలోనూ వేటికవే ఆరోగ్య సంరక్షణలో ముఖ్యపాత్ర పోషిస్తున్నా వాటిలో చెప్పుకోదగినది 'విటమిన్ ఇ'. ఇది లోపిస్తే అనేక అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి. మరి మన శరీరానికి ఇ విటమిన్ ఏ విధంగా ఉపయోగపడుతుందో ఇప్పుడు తెలుసుకుందామా..!

1. 'విటమిన్ ఇ'కి కొవ్వును కరిగించే శక్తి ఉంది. ఊబకాయంతో బాధపడుతున్న వారు తరచూ విటమిన్ ఇ ఉన్న ఆహార పదార్థాలను తీసుకుంటే ఫలితం కనిపిస్తుంది.

2. యాంటీ ఆక్సిడెంట్లు ఇందులో పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండెకు ఎంతో మేలు చేస్తాయి. అంతేకాదు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను దూరం చేస్తాయి. క్యాన్సర్ కణాలను నాశనం చేస్తాయి. రోగనిరోధక శక్తిని పెంచుతాయి. మతిమరుపు సమస్య ఉండదు. దృష్టి లోపం ఉన్నవారికి ఇ విటమిన్ ఆహారం చక్కగా పనిచేస్తుంది.

3. కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. రక్తకణాల వృద్ధికి తోడ్పడుతుంది. నాళాల్లో రక్త ప్రసరణ సులువుగా జరుగుతుంది. మెనోపాజ్ దశలో ఉన్న మహిళలకు వచ్చే సమస్యలను నివారిస్తుంది.

4. పొడిచర్మం ఉన్నవారు విటమిన్ ఇ ఉన్న ఆహారాన్ని ఎక్కువగా తీసుకుంటే వారి చర్మం మృదువుగా మారుతుంది. ప్రధానంగా వయస్సు పైబడుతున్న వారు ఈ ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

5. ఎదిగే చిన్నారులకు విటమిన్ ఇ ఉన్న ఆహారం కచ్చితంగా ఇవ్వాల్సిందేనని పోషకాహార నిపు ణులు చెబుతున్నారు. ఆకుకూరలు, పొద్దు తిరుగుడు, నట్స్, టమాట, గుమ్మడికాయ, చిలగడదుంప, రాక్‌ఫిష్, బొప్పాయి, బ్రోకోలి, అవకాడో వంటి వాటిల్లో విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది.

చరిత్రలో మార్చి 20

ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

1351 : ఢిల్లీ సుల్తాను ముహమ్మద్ బిన్ తుగ్లక్ మరణం.

1602 : డచ్ ఈస్ట్ ఇండియా కంపెనీ స్థాపించబడినది.

1726 : ప్రముఖ శాస్త్రవేత్త, సర్ ఐజాక్ న్యూటన్ మరణం. (జననంబీ1642)

1855 : మొట్టమొదట సిమెంట్‌ను కనుగొన్న జె.ఏస్ప్డిన్ మరణం..(జ.1788)

1951 : భారతదేశపు మాజీ క్రికెట్ క్రీడాకారుడు మదన్‌లాల్ జననం.

1966 : భారత గాయకురాలు అల్కా యాగ్నిక్ జననం.

2008: తెలుగు సినీ నటుడు శోభన్ బాబు మరణం.

2010 : నేపాల్ మాజీ ప్రధానమంత్రి గిరిజాప్రసాద్ కొయిరాలా మరణం



శోభన్‌బాబు అసలు పేరు ఉప్పు శోభనాచలపతిరావు. జనవరి 14, 1937న ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. కృష్ణా జిల్లా చిన నందిగామ ఇతని స్వగ్రామం. తండ్రి పేరు ఉప్పు సూర్యనారాయణరావు. మైలవరం హైస్కూల్లో చదివేరోజుల్లో శోభన్ బాబు నాటకాలపైన ఆసక్తి పెంచుకుని అనతి కాలంలో మంచి నటుడిగా పేరు పొందారు. గుంటూరు ఎసి కాలేజీలో 'పునర్జన్మ' వంటి నాటకాలలో మంచి పేరు సంపాదించుకున్నారు. హైస్కూల్ చదువు పూర్తి అయిన తర్వాత విజయవా డలో ఇంటర్మీడియట్ డిగ్రీ చదువు పూర్తి చేసారు.

చిన్నప్పటి నుంచి సినిమాలంటే చాలా ఇష్టపడేవాడివని, తిరువూరులో కీలుగుర్రం తను చూసిన మొదటి సినిమాలో అని ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. పాతాళభైరవి, మల్లీశ్వరి, దేవదాసు తన భాల్యంలో బాగా అభిమానించిన సినిమాలని, మల్లీశ్వరి సినిమాను 22 సార్లు చూశానని చెప్పారు. మద్రాసులో లా కోర్సులో చేరినప్పటికీ నటన పైన ఆసక్తితో సినిమా ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఉదయం కాలేజీకి వెళ్లి, మధ్యాహ్నం నుండి స్టూడియోల వెంట తిరిగేవారు. అప్పుడే తన పేరును శోభన్ బాబుగా మార్చుకున్నారు. శోభన్‌బాబు 2008, మార్చి 20న ఉదయం 10.50 నిమిషాలకు చెన్నైలో మరణించారు.

శ్రీవేంకటేశ్వర వైభవము

అపార కారుణ్య జలధి యై శేషాచల మునందు (తిరుమల) ఆశ్రిత రక్షణార్థమై అర్చావతా రమున వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరస్వామివారి పుష్కరిణి యందు ప్రతి సంవత్సరము ఫాల్గుణశుద్ధ ఏకాదశి ప్రారంభముగా పూర్ణిమ వరకు అయిదుదినములు శ్రీస్వామి వార్లకు ప్లవోత్సవములు ఉత్సవములు) జరుగును. వేత నరక్షణార్థమై త్రేతాయుగాలంకారముగా అవతరించి ధర్మరక్షణముకావించిన శ్రీరామ చక్రవర్తిస్వామివారు ప్రథమదినమున సాయంకాలము శ్రీ సీతాలక్ష్మణులతో రత్నాభరణాద్యలంకృతులై సువర్ణ తిరుచ్చియందు వేంచేసి చతుర్వీథులు ఉత్సవము జరిగి శ్రీస్వామి పుష్కరి ణీయందుగల చిత్రాతి చిత్రమై అనేక విద్యుద్దీవ భాస్వరమగు ప్లవమందు గల పీఠము నలంకరించెదరు. మంగళవాద్యములతోను, వేద ఘోషలతోను ఆ ప్లవము పుష్కరిణిలో ప్రదక్షిణముగా మూడు పర్యాయములు సంచారముచేసిన తరువాత హారతి అయి శ్రీ కోదండరామస్వామివారు శ్రీవారి సన్నిధానమునకు వేంచేయుదురు.

ధర్మరక్షణార్థమై ద్వాపరయుగాలంకారముగా నవతరించి చేతనో జ్జీవనార్థమై గీతోపదేశమొనరించిన శ్రీకృష్ణస్వామివారు శ్రీరుక్మిణీ అమ్మవారు రత్నాభరణాద్య లంకృతులై రెండవ దినమున తిరుచ్చియందు వేంచేసి చతుర్వీథుల ఉత్సవము జరిగి శ్రీస్వామి పుస్కరిణీయం దుగల అతి రమణీయమగు ప్లవము (తెప్ప) యందు వేంచేసెదరు. వెంటనే మంగళవాద్యములతోను వేదపా రాయణములతోను ఆ ప్లవము (తెప్ప) మూడు పర్యా యములు ప్రదక్షిణముగా సంచారము చేయును. తరువాత శ్రీస్వామివారికి హారతి అయి శ్రీవారి సన్నిదాన మునకు వేంచేయుదురు.కలియుగ ప్రత్యక్ష దైవమై మాన వులకు కామితార్థ ప్రదానము చేయ నర్చావతారమున యవతరించిన శ్రీ వేంకటేశ్వరస్వామి వారు మూడవ దినమున సాయంకాలము తిరుచ్చిలో శ్రీ భూదేవులతో సహా వేంచేసి చతుర్వీథులు ఉత్సవము జరిగి పుష్కరిణ యందుగల అతి భాస్వరమగు ప్లవము నలంకరించెదరు. ఆ పుష్కరిణీయందుగల ప్రదక్షిణ ముగా మూడు పర్యాయములా ప్లవము సంచారము చేయును. శ్రీస్వా

తెప్పోత్సవము



మివారికి హారతి అయి శ్రీవారి సన్నిధికి వేంచేయు దురు. శ్రీస్వామివారికి హారతి అయి శ్రీవారి సన్నిధికి వేంచేయుదురు. ఇటులనే శ్రీమలయప్ప స్వామివారు శ్రీభూదేవులతోను నాలుగవ దినమున తిరువీథులు ఉత్సవము జరిగి తెప్పయందు వేంచేయు దురు. 5 అయిదు పర్యాయములు ప్లవము మంగళా శాసనము లతో వేదారావములతో పుష్కరిణిలో ప్రదక్షిణముగా సం చారము చేయును. శ్రీవారికి హారతి జరిగి ఆలయ మునకు వేంచేయుదురు.

ఇటులనే అయిదవదినమున శ్రీ భూనమేతులైన శ్రీమలయప్పస్వామివారికి తిరువీథులు ఉత్సము జరిగి ప్లవమునందు వేంచేసెదరు. ఆ ప్లవము యేడు పర్యాయములు పుష్కరిణియందు మామూలు మర్యా దలతో సంచారముచేయును. ప్రతి దినము ప్లవము పుష్కరిణిలో సంచారము చేయు సమయమున వేలాది యాత్రిక భక్త జనులు పుత్రమిత్రకళత్రాది పరివారముల తో పుష్కరి ణికి నాలుగు పార్శ్వములయందున్న సోపాన ముల యందు చేరి పరస్పరము ఆనంద సంభాష నములు చేయుచు ఆనందపారవశ్యమును పొందియుం దురు. శ్రీవారికి హారతి జరిగి క్రమముగా బంగారు వాకిలి వద్దకు వేంచేయగా ఆస్థానము జరుగును. తరువాత శ్రీస్వామివారు సన్నిధిలోనికి వేంచేయుదురు.

తుంబురు తీర్థముక్కోటి

అశేషచిదచిద్వస్తు శేషేభూతుడై (తిరమల) ఈ వేదపర్వతమున అర్చావతారమున వేంచేసి యున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధికి 11 మైళ్ళ దూరములోనున్న తుంబురు తీర్థమున ముక్కోటి ప్రతి సంవత్సరము మీనమానము నందు శుక్ల పక్షమున ఉత్తరా నక్షత్ర యుక్తమగు పూర్ణిమా పర్వదినమునందు అపరాహ్ణకాలమున జరుగును. ఈ దినమున శ్రీస్వామివారికి ప్రాత:కాలారాధనము మాధ్యాహ్నికారాదనము పూర్తి అయిన పిమ్మట, అర్చకులు మొదలగు యావత్తు కైంకర్యపరులు, యాత్రికులు, భక్తాగ్రేసరులు భగవన్నామధ్యానములతో బయలుదేరి తుంబురుతీర్థమునకువెళ్ళెదురు. అచ్చట అపరాహ్ణకాలమున స్నానమాచరించి పూతాత్ములై శ్రీవారి సన్నిధానమునకు వచ్చి శ్రీవారిని దర్శించి తీర్థప్రసాదములను స్వీకరించిన వారు సర్వకామములను అనుభవించి అంతమున విష్ణులోకముచేరి నిరతిశయైశ్వర్యమును బడయగలరు. ఈ తుంబురు ఘూణ తీర్థమాహాత్మ్యములను గూర్చి స్కాందపురాణ మిట్లు చెప్పుచున్నది.

సంచలన వార్తాపత్రిక
లీడర్
అనకాపల్లి
విశాఖపట్నం
మంగళవారం 20-3-2018

వైసీపీ విజయానికి కృషి చేస్తాం

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్: మండలంలోని సంపతిపురం పంచాయతీ తుమ్మయ్యపేట గ్రామానికి చెందిన పలువురు యువకులు ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు దాడారావు గోవింద్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వచ్చే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయానికి శక్తివంచనలేకుండా కృషి చేస్తామని వీరు తెలిపారు. గ్రామానికి చెందిన వి.జోగేంద్ర, వి.చిన్న, కె.గంగ అప్పారావు, టి.అప్పలనాయుడు, వి.శ్రీను తదితరులు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నవారిలో ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి నిధుల మంజూరు

విద్యుత్ అధికారుల పనితీరు మార్చుకోవాలి -ఎమ్మెల్యే పీలా


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీలా

అనకాపల్లి, న్యూస్‌లీడర్:
శంకరం అండర్ గ్రౌండ్ డ్రైనేజీని 29 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించడం జరిగిందని, ఈ డ్రైనేజీ 29రోజులు కూడా పనిచేయలేదని సంబంధితశాఖ అధికారులపై ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం స్థానిక జీవీఎంసీ కార్యాలయంలో అన్ని శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో త్రాగునీరు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నాయుళ్ల వీధి, చింతవారి వీధి, ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బొజ్జనకొండకు వెళ్లే రహదారిలో ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని స్వయంగా విద్యుత్‌శాఖ మంత్రి ఆదేశాలిచ్చినప్పటికీ అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వలన రోడ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయని ఆయన అన్నారు. తక్షణమే విద్యుత్ స్తంభాలను మార్పు చేయనిపక్షంలో అనకాపల్లి విద్యుత్ కార్యాలయం ముందు టెంట్ వేసి నిరసన తెలిపేందుకు వెనుకాడేది లేదని హెచ్చరించారు. అనకాపల్లి పట్టణంలో గవరపాలెంలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు ఇండోర్ సబ్‌స్టేషన్‌కు ఐదుకోట్లరూపాయలు విలువైన స్థలాన్ని ఏపీఈపీడీసీఎల్ ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. తాను శాసన సభ్యుని బాధ్యతలు స్వీకరించిన ఆరు నెలల్లోను అప్పటి సీఎండీ సహకారంతో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు 154 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. తదుపరి విద్యుత్ అధికారులకు ఏ పనులను చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. జీవీఎంసీ పరిధిలో గల ఎనిమిది పాఠశాలలకు మౌలిక వసతుల కల్పనకు రెండుకోట్ల 25లక్షల రూపాయలు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో ఎనిమిది స్కూళ్లను మే 31వ తేదీకి కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. సత్యనారాయణ థియేటర్ జంక్షన్ నుంచి సుంకరమెట్ట జంక్షన్ వరకు సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణాలు చేపట్టే యజమానులు వ్యర్థాలను ఇష్టమొచ్చినట్లు రోడ్లపై వేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై నోటీసులు జారీ చేసి అపరాధ రుసుములను వసూలు చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు, జోనల్ కమిషనర్ షేక్ సుభాని, ఏసీపీ అమ్మాజీరావు, ఏఈ రాజశేఖర్, జీవీఎంసీ ఎలక్ట్రికల్ ఏఈ నానాజీ, టీపీఆర్వో రజనీ, జిల్లా తెలుగుదేశంపార్టీ ఉపాధ్యక్షులు మళ్ల సురేంద్ర, బీఎస్ఎంకే జోగినాయుడు, బొలిశెట్టి శ్రీనివాసరావు, మళ్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడికి చర్యలు తీసుకోవాలి

కశింకోట మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో అధికారులతో ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో మంచినీటి ఎద్దడి గురికాకుండా చూడాలని, ఇంటింటికీ కొళాయి సర్వే పూర్తి చేయాలని, ఏప్రిల్ నెలాఖరుకు కశింకోట గ్రామంలో ఇంటింటికి కొళాయిలు పూర్తి చేసి అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలిపారు. ప్రతీ గ్రామంలో ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులతో పెండింగులో ఉన్న సిమెంట్ రోడ్లు పూర్తి చేయాలన్నారు. ప్రతీ గ్రామం పంచాయతీల్లో ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎన్టీఆర్ గృహ స్కీం లబ్ధిదారులు ఎంతమంది ఉన్నారో అంతమందికి ఇళ్లు ఇస్తామన్నారు. పెండింగు సమస్యలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంచకర్ల లక్ష్మి, జెడ్పీటీసీ మలసాల ధనమ్మ, ఆర్ఈసీఎస్ పర్సనల్ ఇన్‌ఛార్జి మలసాల రమణారావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కాయల మురళి, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, వేగి గోపీకృష్ణ, పంచదార్ల సూరిబాబు, ఆడారి నర్సింగరావు, పొనగంటి సూరరాజు, బుగిన రమణమూర్తి, గొంతిన శ్రీనివాసరావు, తహశీల్దార్ జ్ఞానవేణి, ఎంపీడీవో వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు

తుమ్మపాల(అనకాపల్లి), న్యూస్‌లీడర్:
ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా భిక్ష కాదని ఐదుకోట్ల ఆంధ్రుల హక్కుఅని పార్లమెంటు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సోమవారం స్థానిక నాలుగురోడ్ల జంక్షన్‌వద్ద ప్రత్యేక హోదా కోరుతూ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి జగన్మోహనరెడ్డి తీసుకున్న నిర్ణయానికి మద్దతుగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక హోదా, రైల్వేజోన్ విషయమై పార్లమెంటులో మొదటి నుంచి పోరాడుతున్నది వైసీపీ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నాలుగేళ్ళ కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామి అయినవరకే ఇప్పటి వరకు ప్రత్యేక హోదా సాధించలేకపోవడం దారుణమన్నారు. తెలుగువారందరికీ దాహో రేపో ఉంటున్న తరుణంలో ప్రత్యేక హోదా సాధించేందుకు ఎందుకు ముందుకురాలేదు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి వైసీపీకి మద్దతు తెలియజేయాలని అమర్ కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వరుదు కళ్యాణి, దంతులూరి దిలీప్‌కుమార్, మళ్ల బుల్లిబాబు, సూరిశెట్టి రమణఅప్పారావు, గొర్లి సూరిబాబు, జాజుల రమేష్, వేగి త్రినాథ్, శీరెడ్డి జగన్, రైతారి రాజు, కుండల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే వైసీపీ నిర్వహించిన మానవహారంకు సీపీఐ, సీపీఎం పార్టీల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.


నాలుగురోడ్ల జంక్షన్‌లో మానవహారం నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు

సేవా కార్యక్రమాల్లో ప్రతీఒక్కరూ ముందుండాలి

మునగపాక, న్యూస్‌లీడర్: సేవా కార్యక్రమాలు చేయడంలో ప్రతీ ఒక్కరూ ముందుండాలని ఎలమంచిలి నియోజకవర్గం టీడీపీ నాయకుడు సుందరపు విజయకుమార్ కోరారు. మండలంలోని మునగపాక మెయిన్‌రోడ్డువద్ద జనతా గ్యారేజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని విజయకుమార్ ప్రారంభించారు. దీనిలో భాగంగా రహదారిపై వెళ్లే ప్రయాణీకులకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. వేసవికాలంను దృష్టిలో ఉంచుకొని ఇక్కడ చలి వేంద్రం ఏర్పాటుచేసినట్లు కొరుకొండ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంటకోట విజయ్, ఆడారి సూరిబాబు, మద్దాల కృష్ణ పాల్గొన్నారు.


చలివేంద్రం ప్రారంభిస్తున్న విజయకుమార్

మరిడమ్మ జాతర ఏర్పాట్లపై మంత్రి అయ్యన్న సమీక్ష


సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, న్యూస్‌లీడర్:
నర్సీపట్నం లో ఈ నెల 22 నుండి 30 వరకు మరిడి మహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు అధికారులు ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతరకు తరలి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆయన అన్నారు. శాంతి భద్రతల పై కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని పోలీసులకు సూచించారు. తాగు నీటి ఏర్పాట్లు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు సిసి కెమెరాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని నర్సీపట్నం ఏఎస్పీకి తెలిపారు. వైద్య సదుపాయాలు అంబులెన్స్ లు ఏర్పాటు చేయాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు.రవాణా సౌకర్యాం ఏర్పాట్లను భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్టీసి అధికారులకు సూచించారు. శానిటేషన్ పరిశుభ్రత పై ప్రత్యేక ద ష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ సన్యాసిపాత్రుడు, ఏఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, ఆర్డీవో సూర్యారావు, డిఎస్పీవో శిరీషరాణి, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించాలి

నర్సీపట్నం, న్యూస్‌లీడర్:
అన్‌రాక్ పరిశ్రమను తెరిపించి స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని, భూనిర్వాసితులకు, దేశిప్పత్తులు దారికి వన సంరక్షణ సమితుల ద్వారా అడవులను అభివృద్ధి చేసి ఉపాధి కల్పించాలని మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాలపాప, అన్‌రాక్ నిర్వాసితుల సంఘం అధ్యక్షులు రుత్తల యర్రాపాత్రుడు, నర్సీపట్నం మాజీ ఎంపిపి బోళెం వెంకటరమణమూర్తి అఖిలపక్ష నాయకులు సోమవారం ఆర్డీవో కె.సూర్యారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీలేరు నీటిని ఈ ప్రాంత వ్యవసాయ రైతులకు వ్యవసాయం, తాగునీటి అవసరాలకు తక్షణం విడుదల చేయాలన్నారు. నాతవరం మండలం సరుగుడు నుంచి లేటరైట్ పేరుతో తరలిస్తున్న బాక్సైట్‌ను అన్‌రాక్ పరిశ్రమకు కేటాయించాలన్నారు. అన్‌రాక్ ఫ్యాక్టరీ గత 10 సంవత్సరాలు నడవటం లేదన్నారు. దీంతో నిరుద్యోగులకు పని లేకుండా పోయిందన్నారు. దీంతో అత్యవసరంగా ఫ్యాక్టరీని తెరిపించి స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. లేకుంటే ఉద్యమాలు చేస్తామని వారు హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు ఐ.మాణిక్యం, అడ్డెపల్లి గణేష్, కన్నూరు సత్యనారాయణ, బోళెం వెంకటరమణ, రుత్తల జమీందార్, బర్నికి సూరిబాబు, వర్రి శ్రీనివాసరావు, మాకిరెడ్డి అప్పలనాయుడు, ఒసుం శ్రీనివాసరావు, యర్రంశెట్టి పాపారావు, చెవ్వాకుల గోవింద, దుంగల వెంకటరమణ, అప్పిరెడ్డి గణేష్, లాలం వెంకటరమణ, చింతాడ సూరేశ్వరరావు పాల్గొన్నారు.

రహదారిపై అక్రమంగా నిర్మించిన గోడను తొలగించండి

జీవీఎంసీ కమిషనర్, డీఎస్పీలకు ఫిర్యాదు

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్: రహదారిపై రాత్రికి రాత్రే అక్రమంగా నిర్మించిన గోడను వెంటనే తొలగించాలని కోరుతూ బుద్ద అప్పలనాయుడు, అదే ప్రాంతానికి చెందిన మరికొంతమంది జీవీఎంసీ కమిషనర్ సుభానికి, డీఎస్పీ కేపీ రమణకు సోమవారం వినతిపత్రం అందించారు. గోడను తొలగించి రహదారి ద్వారా రాకపోకలు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని వీరు కోరారు. గవరపాలెం కేంద్రీయ పాఠశాల నుండి లోపలిగా ఉన్నవారంతా ఈ రహదారి ద్వారా రాకపోకలు సాగించేవారని, ఈ గోడ నిర్మాణం చేయడం వలన రాకపోకలకు ఇబ్బందిగా ఉందని వీరుకోరారు. అక్రమంగా గోడను నిర్మించి రాకపోకలకు ఇబ్బంది కలిగించిన వారిపై తక్షణమే చర్యలు తీసు కోరారు.

నీటి తీరువా బకాయిలు వసూలు చేయండి

మాడుగుల, న్యూస్‌లీడర్: గ్రామాలలో రైతుల దగ్గర వెంటనే నీటి తీరువా బకాయిలు వెంటనే వసూలు చేయాలని మాడుగుల తహశీల్దార్ లోకవరపు రామారావు రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఉదయం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం మాడుగుల మండలంలో 40లక్షల రూపాయలు బకాయి ఉందని, ప్రస్తుతం 76వేల రూపాయలు మాత్రమే వసూలు అయిందని చెప్పారు. లక్ష్మీపురం గ్రామంలో 138 ఎకరాలలో భూమి సర్వే చేయడం జరిగిందని, ఎం.కోటపాడు, సాగరం, జంపెన గ్రామాలలో ప్రస్తుతం భూములను సర్వే చేస్తున్నామని చెప్పారు. శంకరం, కింతలి వల్లాపురం, చిననాదా, లక్ష్మీపురం గ్రామాలలో సర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. దీనికి సంబంధించి మూడు టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. రెండు నెలల కాలంలో ఈ సర్వేను పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పి.లక్ష్మీ కాంత్ పాల్గొన్నారు.

తులసీ కళ్యాణ మండపానికి రహదారి నిర్మాణం

మాడుగుల, న్యూస్‌లీడర్: మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి తులసీరావు సుమారు రూ.40లక్షలతో నిర్మించిన కళ్యాణ మండపానికి సర్పంచ్ దంగేటి వెంకట లక్ష్మి ఆధ్వర్యంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఈ రహదారి నిర్మించడం వలన మోదకొండమ్మ ఆలయం నుండి కళ్యాణ మండపానికి వివాహాలు చేసుకునే భక్తులకు రహదారి సౌకర్యం ఏర్పడిందని ఆలయ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు.


నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలి

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్:
మండలంలో కొత్తూరు పంచాయతీ సర్వే నంబర్ 643/3లో బడాబాబులు ఆక్రమించుకున్న ప్రభుత్వభూమిని స్వాధీనపరుచుకొని ఎస్సీ, ఎస్టీలకు చెందిన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరుతూ ఎరుకుల హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ డివిజన్ అధికారికి వినతిపత్రం అందించారు. ఎరుకుల కులానికి చెందిన నిరుపేద ప్రజలు సంచార జీవనం సాగిస్తున్నా దుర్భర జీవితం గడుపుతున్నారని ఆ సంఘ గౌరవ సలహాదారుడు దాసరి రాములు, దాసరి కుమారరాజు అన్నారు. ప్రభుత్వం తమను ఎస్టీల గుర్తించినా ఇప్పటికీ స్వంతగూడు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పూజారి నర్సయ్య, పూజారి పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆది నుండే ప్రత్యేక హోదాపై పోరాటం

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్:
ఏపీకి ప్రత్యేక హోదా కావాలని కోరుతూ మొదటి నుంచి వైఎస్సార్‌సీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి పలు ఉద్యమాలను చేపట్టారని ఆ పార్టీ నాయకులు పాలిక నిరీక్షణ్‌కుమార్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలకు చేరువవారోమూగా ఉంటూ పలు పథకాలను అందే విధంగా పనిచేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ ముందుగానే రూపకల్పన చేసిందని ఈ విషయాన్ని ప్రజలందరూ గుర్తించాలని నిరీక్షణ్ కుమార్ తెలిపారు.

ఉగాది పురస్కారాలు అందజేత



గాజువాక : న్యూస్‌లీడర్
ఉగాదినాడు ప్రతిభావంతులకు పురస్కారాలు అందజేయడం మంచి పరిణామమని ఆంధ్రాయూనివర్శిటీ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఉగాదినాడు శ్రీబాలగౌరీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సమాజిక సేవ, ప్రభుత్వ ప్రైవేటు వివిధ రంగాల్లో ప్రతిభావంతులకు ఉగాది పురస్కారాలను 23 మందికి అందించారు. ఈ సందర్భంగా గాజువాక తాహశీల్దార్ చేతన్ కుమార్, జీవియంసి ఎయం హెచ్‌ఓ డా॥ జయరాం, స్టీల్ ప్లాంట్ ట్రాఫిక్ సిఐ టి లక్ష్మి, ప్రభుత్వ వైద్యాధికారి డా॥ హేమలత, బాల నటులుగా సీరుకొండ పూర్వేష్ తదితర నేతలకు శాలువాలు కప్పి జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ ప్రతీ ఏటా జిల్లాలో ఉన్న ప్రతిభావంతులకు ఉగాది నాడు పురస్కారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వారు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలతో పాటుగా ఉన్నత విలువలను కాపాడేందుకు ప్రోత్సాహాలు అందించేందుకు అన్నివిధాలా చర్యలు తీసుకోనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు దొడ్డిరమణ, పి నాగేశ్వరరావు, విశ్వా రాం మోహన్‌కుమార్, భాను ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

26న సీతారాముల కల్యాణం

రావికమతం, న్యూస్‌లీడర్: రావికమతంలోని కోదండ రామాలయంలో సీతారామ కళ్యాణానికి ఆలయ పురోహితుడు గిరిబాబు ఆధ్వర్యంలో గ్రామస్థులు పెళ్లి రాట వేసే కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ ఈ నెల 26న గంజి అరి ఆలయంలో జరిగే సీతారామ కల్యాణానికి ఎటువంటి విఘ్నాలు ఎదురుకాకుండా ఉండాలని ఆలయ ఆవరణలో ఉగాది రోజున పెళ్లి రాట వేశామన్నారు.అనంతరం గ్రామానికి చెందిన దేవత నరసింగరావు, చిట్టి మణి దంపతులు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు.

లేటరైట్ లారీలు నిలుపుదల


లేటరైట్ లారీలను అడ్డుకున్న దృశ్యం

నాతవరం, న్యూస్‌లీడర్:
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త పెట్ల ఉమాశంకరగణేష్ ఆధ్వర్యంలో సోమవారం నాతవరం మండల కేంద్రంలో లేటరైట్ లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరుగుడు పంచాయతీకి రావల్సిన నిధులు ఇవ్వేంత వరకు లారీలను వదిలే ప్రసక్తి లేదని చెప్పారు. ఈ సందర్భంగా అక్కడ ఒకింత ఆందోళనకరమైన వాతావరణం నెలకొంది. వెంటనే స్థానిక ఎస్సై వి.సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకొని నాయకులతో మాట్లాడారు. అయినా నాయకులు స్పందించకపోవడంతో లేటరైట్ యాజమాన్యంను పిలిపించారు. దీంతో లేటరైట్ యాజమాన్యం ఈ నెల 30 వరకు మాత్రమే లారీలను తిప్పుతామని, ఏప్రిల్ 1 నుంచి తిప్పబోమని చెప్పడంతో నాయకులు శాంతించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ సరుగుడు పంచాయతీకి రావల్సిన నిధులను వెంటనే ఇవ్వాలన్నారు. లేటరైట్ లారీల వల్ల రోడ్లు పాడవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు అంకంరెడ్డి జమీలు, శెట్టి సూరరాజు, పైల పోతురాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదవులు కాదు సమాజసేవపైన సమయం కేటాయించాలి

టీడీపీ నాయకులు సుందరపు

ఎలమంచిలి, న్యూస్‌లీడర్:
సమాజసేవలో ప్రజల అవసరాలు తీరిస్తే పదవులు వాటంతటవే వస్తాయని ఎలమంచిలి నియోజకవర్గ సీనియర్ టీడీపీ నాయకులు సుందరపు విజయకుమార్ అన్నారు. ఉగాది కొత్త సంవత్సరం సందర్భంగా ఎలమంచిలి పట్టణంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాన్ని, ఒక మంచినీటి ట్యాంకర్‌ను సుందరపు విజయకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా తను పనిచేస్తున్నానని, వేసవిలో ప్రజలు మంచినీటి ఎద్దడికి గురికాకుండా అవసరమైన చోటికి వాటర్ ట్యాంక్ ద్వారా మంచినీరు సరఫరా చేస్తామన్నారు. నియోజకవర్గం ప్రధాన కూడళ్లలో మంచినీరు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతీ ఇంటి ముందు పశు పక్షాదులకు నీళ్లు ఉంచాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బధుడు లోవరాజు, ఆర్ఎంఎల్ శ్రీనివాస్, చిట్టిబాబు, అప్పలనాయుడు, అనపర్తి రాజు, సుందరపు యువసేన పాల్గొన్నారు.



కరాటే కలర్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహణ



గాజువాక : న్యూస్‌లీడర్
విద్యార్థి దశనుండే కరాటేలో ప్రతిభను పొందేవిధంగా సాధనలు చెయ్యాలని రాష్ట్ర షిర్యింగ్ కరాటే దూ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ సతీష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం బీసి రోడ్డు బల్లల పెదిపలిల పాఠశాలలో ఏర్పాటు చేసిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ కార్యక్రమంలో మరో విశిష్ట అతిధిగా పాల్గొన్న గాజువాక శాంతిభద్రతల ఎస్ఐ శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 108 మంది కరాటే విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి వివిధ హోదాలతో కేటాయించిన రంగు బెల్టులను అందజేసారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కరాటే క్రీడ ప్రపంచ స్థాయిలో ఉన్నతవిలువలను పెంచిందని తెలిపారు. ప్రధానంగా మహిళలు, యువతులు పెద్ద ఎత్తున కరాటే శిక్షణలో నైపుణ్యం పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ దొడ్డిరమణ, రాము, కోచ్‌లు కె లాజర్,పి నాగరాజు వ కరాటే విద్యార్థులు, వివిధ హోదాల కోచ్‌లు పాల్గొన్నారు.

22న ఆర్ఈసీఎస్ సర్వసభ్య సమావేశం

కశింకోట, న్యూస్‌లీడర్: అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంఘం సర్వసభ్య సమావేశం ఈ నెల 22వ తేదీన ఉదయం 10గంటలకు సంస్థ ప్రధాన కార్యాలయంలో జరుగుతుందని ఆర్ఈసీఎస్ ఎండీ డి.శ్రీనివాసరాజు తెలిపారు. ఈ సందర్భంగా బిజినెస్, వ్యవసాయం, గృహ వినియోగదారుల సభ్యులందరూ ఈ సర్వసభ్య సమావేశానికి విచ్చేయాలని కోరారు. ఎజెండాపై తీర్మానాలపై సమావేశం నిర్వహిస్తామన్నారు. 2017-18 సంఘ పరిపాలన కాలానికి నివేదిక చదువుట, 2017- 18 జమాఖర్చులు, ఆడిట్ ఆమోదం, 2018-19 అంచనా బడ్జెట్ చదువుట, ఇతర అంశాలపై పర్సనల్ ఇన్‌ఛార్జి అనుమతిపై సమావేశం నిర్వహిస్తామన్నారు.

ప్రజలకు చేరువలో గెట్‌ఆన్ డయల్ సేవలు

ఏసీపీ కింజారపు ప్రభాకర్



ఎన్ఏడీ, న్యూస్‌లీడర్: ప్రజలకు చేరువలో గెట్‌ఆన్‌లైన్ డయల్ సేవలు ప్రారంభమవడం ఆనందకరమని ట్రాఫిక్ ఏసీపీ కింజరాపు ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు కె ఎస్ అసోసియేట్స్ ఆధ్వర్యంలో స్థానిక జీవీఎంసీ 39 వార్డు మురళీనగర్ ఏర్పాటు చేసిన గెట్ ఆన్ డయల్ వెబ్ సైట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వెబ్‌సైట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ప్రస్తుతమున్న సమాజంలో ప్రతీ మానవుడు తనకున్న సమయంలో ఉరుకులు పరుగులు తీస్తున్న వేళల్లో ఈ వెబ్‌సైట్ ద్వారా ఫోన్ సమాచారంతోనే పలు సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పవన్ కుమార్, సీహెచ్ సాయి, జి రాజశేఖర్ ఎం.మోహన్, బి ప్రసాద్, సి హెచ్ హేమావతి, బి లత, పి .హేమావతి పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారం



ఎన్ఏడీ, న్యూస్‌లీడర్: జీవీఎంసీ ఉత్తర నియోజకవర్గంలో వివిధ పత్రికల్లో, టీవీఛానల్స్‌లో పాత్రికేయులుగా విధులు నిర్వహిస్తున్న దేవి, మహమ్మద్ సర్వర్‌కు జీవీఎంసీ కమిషనర్ హరినారాయణ జారీచేసిన ప్రశంస పత్రాలను ఉగాది వేడుకలలో భాగంగా ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అర్హులైనట్లకు అందజేశారు. కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుంది అనడానికి నిదర్శనం ఈ అవార్డులందుకున్న అర్హులైన్లని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ రమణమూర్తి, ఎం హెచ్‌ఓ మురళీ మోహనరావు, స్థానిక టీడీపీ నాయకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


రైల్వేజోన్ ఏర్పాటుకు బీజేపీ కట్టుబడి ఉంది

ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు



ఎన్ఏడీ, న్యూస్‌లీడర్: విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటుకు బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణు కుమార్‌రాజు పేర్కొన్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉగాది వేడుకల్లో భాగంగా జీవీఎంసీ జోన్ -2, జోన్ -4 సంయుక్తంగా జీవీఎంసీ 39వ వార్డు పరిధి మాధవధార ఉడా కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఈసందర్భంగా మాట్లడుతూ బీజేపీతో మిత్ర పక్షంగా ఉన్న టీడీపీ కొన్ని కారణాల వలన బయటకి రావడం బాధాకరమైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ 2, 4 జోనల్ కమిషనర్లు టీడీపీ నాయకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దొడ్డి కిరణ్ జన్మదిన వేడుకలు



ఎన్ఏడీ, న్యూస్‌లీడర్: స్థానిక జీవీఎంసీ 66 వార్డు వైసీపీ వార్డు అధ్యక్షుడు దొడ్డి కిరణ్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఏడీ జంక్షన్‌లో నగర వైసీపీ అధ్యక్షుడు మళ్ల విజయప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పార్టీ కార్యకర్తలతో అభిమానులకు పంచిపెట్టారు. వార్డు అధ్యక్షులు దుక్కా ప్రసాద్ రెడ్డి, జియ్యాని శ్రీధర్, జియ్యాని మారుతీ, మహిళా అధ్యక్షురాలు గరికిన గౌరి, శ్రీదేవి వర్మ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సంచలన వార్తాపత్రిక
లీడర్
ఉత్తరాంధ్ర జోన్
విశాఖపట్నం
మంగళవారం 20-3-2018

ఘనంగా హజ్రత్ ఖ్వాజా గరీబ్ నవాజ్ రహ్మతుల్లా అలై ఛాదర్ చందనోత్సవ వేడుకలు

ఎస్‌పిపి, న్యూస్‌లీడర్: జీవీఎంసీ 40వ వార్డు పరిధి దావూద్ షరీఫ్ హుస్సేన్ నగర్ వద్ద మస్జిద్-అల్-ఖాదిర్ ఆధ్వర్యంలో హజ్రత్ ఖ్వాజా గరీబ్ నవాజ్ రహ్మతుల్లా అలై ఛాదర్ చందనోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈమేరకు నేకుమహమున ప్రత్యేక సమాజ్ ఆచరించిన ముస్లింలు సోదరులు అనంతరం ఖురాన్ పఠించారు. ఈ సందర్భంగా గ్రామ ఉపాధ్యక్షులు మహమ్మద్ సర్వర్ మాట్లాడుతూ సాయంత్రం మర్రిపాలెం పరిసర ప్రాంతల్లో ఛాదర్ చందన్ యాత్ర నిర్వహిస్తున్నారు. అదే విధంగా ఈనెల 25న హజ్రత్ షరీఫ్ వద్ద జరగనున్న చందనోత్సవ వేడుకల్లో పాల్గొని ఛాదర్ సమర్పిస్తున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి అన్వర్ వలి, నూరి, మున్నా, జిలానీ, దాదా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

60 అడుగుల రోడ్డు సత్వరం పూర్తి చేయండి

- కమిషనర్ హరినారాయణన్



14వ వార్డులో పర్యటిస్తున్న కమిషనర్

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: జీవీఎంసీ రెండవ జోన్ 14వ వార్డు లో సోమవారం కమిషనర్ హరినారాయణన్ పర్యటించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద కళ్యాణమండపం నుండి కె.ఆర్.యం కాలనీ, సత్యనారాయణ పాలెం లలో పర్యటించి పలు సూచనలు చేశారు. డంపర్‌బిన్ల చుట్టూ పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా రోడ్ మార్జిన్లు, వెర్టు ఎడ్జ్‌లను శుభ్రం చేయాలని పేర్కొన్నారు. తాగునీటి పైపులు సత్యనారాయణ పాలెంలో లీకవుతున్నందున వెంటనే పరిశీలించి త్రాగునీరు కలుషితం కాకుండా చూడాలని ఆదేశించారు. యుజిడి పైపులు, త్రాగునీటి పైపులు లీక్ కాకుండా పర్యవేక్షించాలని, లీకయ్యేటట్లు కన్పిస్తే తక్షణం పైపులను మార్చి త్రాగునీరు కలుషితం కాకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తొలుత సత్యనారాయణపాలెం, క్రాంతినగర్, 6, 7 వీధులలో పర్యటించారు. 60 అడుగుల రహదారి విస్తరణ పనులకు ఆటంకాలు తొలగినందున తక్షణం రహదారి నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారికి అడ్డంగానున్న మరమ్మత్తు కాల్వ, బడ్డీలు తొలగించి రహదారి నిర్మాణానికి దోహదపడాలని కోరారు. పర్యటనలో రెండవజోనల్ కమిషనర్ పి.నల్లనయ్య, ఇ.ఇ వెంకటి, ఎసిపి నాయుడు, శానిటరీ సూపర్‌వైజర్ రమణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎలక్ట్రికల్ ఏ.ఇ నాయుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఏఈ కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కడుపుబ్బా నవ్వించిన హాస్యావధానం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏయూ వీసీ ఆచార్య నాగేశ్వరరావు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : అవధాని చతురత, చమత్కారం,సందర్భోచితమైన పదాల విరుపు... ప్రాశ్నికుల హాస్య ప్రియత్వం, సంచాలకుని సమయోచిత పద ప్రయోగ జ్ఞానం, ప్రేక్షకుల హర్షధ్వానాలు వెరసి 'హాస్యావధానం' రక్తికట్టింది. ప్రేక్షకుల్ని ఆద్యంతం కడుపుబ్బా నవ్వించింది. పరవస్తు పద్యపీఠం ఆధ్వర్యాన శ్రీ విళంబి నామ సంవత్సర ఉగాది సందర్భాన్ని పురస్కరించుకొని సిరిపురం కూడలి ఆంధ్ర విశ్వకళాపరిషత్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అసెంబ్లీ హాలులో ప్రపంచ ప్రఖ్యాత 'హాస్యబ్రహ్మ' శంకర నారాయణ నిర్వహించిన 'హాస్యావధానం' సభాసదుల్ని పొట్ట చెక్కలయ్యేట్లు నవ్వించింది. పీఠం వ్యవస్థాపక గౌరవాధ్యక్షులు, విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత డాక్టర్ సూరపనేని విజయ కుమార్ సారథ్యం, అధ్యక్షుడు ఫణీశయన సూరి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమం ఆద్యంతం తెలుగు సంప్రదాయానికి ప్రతీకగా నిలిచింది, సభా వేదికపైన, సభాప్రాంగణంలో వస్త్రధారణ, అలంకరణల్లో తెలుగుదనం కొట్టొచ్చినట్టు కనిపించింది.

కార్యక్రమ ప్రారంభంలో సరస్వతీ నృత్య కళామందిర్ (గెంటుర్తి) బాలలు మా తెలుగుతల్లికి మల్లెపూదండ, తెలుగు భాష ఉద్యమం తెలుగు జాతి గొప్పతనం, వంటి స్వాగత నృత్యాలతో సభాసదుల్ని రంజింపచేశారు.పరవస్తు పద్యపీఠం బాలలు పద్య పఠనం, వివిధ వేషధారణలు,బులుసు వెంకటేశ్వర్లు ఉగాది కవితలు ఆసక్తికరంగా సాగాయి. పృచ్ఛకులు జీవీ త్రినాథ్, డాక్టర్ ఎస్.ఎస్.ఆర్. కృష్ణారావు, జబ్బారి జాగృతి, నటులు దర్శకులు కోరుకొండ శేషగిరి రావు, కాశీ విశ్వనాథ్ శ్రీయేటివ్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఎస్. శ్రీధర్ వ్యవహరించారు. డాక్టర్ సూరపనేని విజయ్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ సభకు అతిథులుగా ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ఉప కులపతి ఆచార్య గొల్లపల్లి నాగేశ్వర రావు, ఆంధ్ర విశ్వ కళాపరిషత్ రిజిస్ట్రార్ ఆచార్య వెలగపూడి ఉమా మహేశ్వర రావు, గీతం విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రామకృష్ణ తదితరులు హాజరయ్యారు. సంప్రదాయ వస్త్రధారణలో కుటుంబసమేతంగా, సభాలంలో ఈ కార్యక్రమానికి హాజరైన వారి పేర్లు నమోదు చేసుకొని వారి నుంచి నిర్వాహకులు కొంతమందిని ఎంపిక చేసి తెలుగు సంప్రదాయానికి ప్రతీకగా మహిళలకు పట్టుచీర, పసుపు, కుంకుమలతో సత్కరించారు.

ఘనంగా పెద్దింటిమ్మ అమ్మవారి పరస



మల్కాపురం, న్యూస్‌లీడర్: మల్కాపురం 49 వార్డు లో ఉగాది పర్వదినం పురస్కరించుకొని నగరాల వీధి లో వెలిసి వున్న శ్రీశ్రీశ్రీ పెద్దింటమ్మ అమ్మవారి పరస నగరాల యువత ఆధ్వర్యం నిర్వహించారు. ఈ కార్యక్రమం నకు ముఖ్య అతిథి గా పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యే పి .గణబాబు అమ్మవారి దర్శించు కున్నారు .అనంతరం సాముగారిడి ,సేదుగారిడి, కర్ర సాములు ,రికార్డింగ్ డాన్స్ ,డాన్స్ బేబీ డాన్స్ ,వంటి కార్యక్రమం లో నిర్వహించారు .ఈ కార్యక్రమం నకు 49 వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మజ్జి సోమేష్ ,టిడిపి సీనియర్ నాయకులు దాకి పొలిరెడ్డి ,సర్వసిద్ధి శ్రీనివాసరావు ,జిటి ,భూలోక ,సూరెల శ్రీనివాసరావు ,ఉరుకుటి మురళి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు భోగవిల్లి నాగభూషణ్ ,భోగవిల్లి ప్రభాకరరావు పాల్గొన్నారు

ప్రత్యేక హోదా కోసం

సమిష్టి పోరాటం

మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం, న్యూస్‌లీడర్: ప్రత్యేక హోదా సాధన రాజకీయ పార్టీలతో పాటు ప్రజలంతా సమిష్టిపోరాటం చేస్తేనే ప్రత్యేక హోదా సాధించగలమని చోడవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కరణం ధర్మశ్రీ అన్నారు. సోమవారం ఉదయం పట్టణంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం కొత్తూరు జంక్షన్ వద్ద కాంగ్రెస్‌పార్టీ, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు పలువురు కార్యకర్తలు ఆధ్వర్యంలో మానవహారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా సాధనకు తమ నాయకుడు జగన్ నిరంతర పోరాటం చేస్తున్నారని, అలాగే ఇప్పటి వరకు మిన్నకున్న తెలుగుదేశంపార్టీ ఎన్నికల ముందు ఎత్తులు వేసి ప్రత్యేక హోదా అంశం లేవనెత్తుతున్నారు. పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానం పెడతామని ముందుగా తమ నాయకుడు జగన్ ప్రకటించడంతో తెలుగుదేశంపార్టీ భయపడి ముందుకు వచ్చి అవిశ్వాస తీర్మానం పెట్టించున్నారు. ఎలాగైనా ప్రత్యేక హోదా సాధించాలంటే ప్రజలంతా సమిష్టిగా కృషి చేసి కేంద్రంపై ఒత్తిడి తెద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముక్కా మహాలక్ష్మీనాయుడు, వెంపలి ఆనంద్, సుంకరి దుర్గి, ఎం.శ్రీకాంత్, ఏడువాక సత్యారావు, ఓరిగంటి నెహ్రూ, పల్లా నర్సింగరావు, దాడి గోవింద తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలెండర్‌లో నీరు



నీళ్లు ఉన్న సిలెండర్

కశింకోట, న్యూస్‌లీడర్: కశింకోట హౌసింగ్ కాలనీకి చెందిన పొదాల కృష్ణవేణి, ఇండియన్ గ్యాస్‌ను గత వారం విడిపించారు. ఆ గ్యాస్‌లో రెండు రోజులు వంట చేయగానే గ్యాస్ అయిపోయి గ్యాస్ సిలెండర్ బరువుగా ఉండటంతో నీరు ఉన్నట్లు గుర్తించారు. ఈ గ్యాస్ సిలెండర్‌ను అనకాపల్లి ఇండియన్ గ్యాస్ ఏజెన్సీకి తెలియపరచగా గ్యాస్‌ను వాపసు తీసుకొని మళ్లీ కొత్త గ్యాస్‌కు డబ్బులు తీసుకొని ఇచ్చారు. వాపసు తీసుకున్న గ్యాస్‌కు రీప్లేస్‌మెంట్ వచ్చాక అప్పుడు గ్యాస్ ఇస్తామన్నారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ చర్యలు తీసుకోవాలన్నారు.

'స్కూలు ఆఫ్ వండర్ కిడ్స్'ఓ సరస్వతి నిలయం

బీఎస్ఈజెడ్ కమిషనర్ త్రినాథ్ కుమార్

దాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: పిల్లలకు ఒత్తిడిలేని చక్కని విద్యను అందిస్తున్న స్కూలు ఆఫ్ వండర్ కిడ్స్ ఒక సరస్వతి నిలయంగా గోచరిస్తుందని వీఎస్ఈజెడ్ కమిషనర్ డాక్టర్ త్రినాథ్ కుమార్ తెలిపారు. సిరిపురం వీఐపీ రోడ్డులో వున్న పాఠశాలలో సోమవారం జరిగిన టాలెంట్ ఎగ్జిబిషన్‌కు ఆయన ముఖ్య అతిథిగా ఆయనతో పాటు శ్రీకాకుళం డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ సీహెచ్ శ్రీదేవి, హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల మెదడుకు పదును పెట్టే క్లిష్టమైన అంశాలను కూడా సునాయాసంగా అర్థంచేసుకునే అన్ని రహస్యాన్ని ఈ టాలెంట్ ఎగ్జిబిషన్ చాటి చెప్పిందన్నారు. ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శ్రీదేవి మాట్లాడుతూ బాల్యంపై ఎటువంటి ఒత్తిడి లేకుండా సింపుల్ టెక్నిక్స్ ఉపయోగించి ఆడుతూ, పాడుతూ బాలల్ని అసాధారణ మేధావులుగా తీర్చిదిద్దే విద్యాబోధన పద్ధతులని అవలంభిస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు మజ్జి రామునాయుడు, శ్రీవాణి పాల్గొన్నారు.



అంగన్వాడీ బకాయిలు విడుదల చేయాలి

రోలుగుంట, న్యూస్‌లీడర్: అంగన్వాడీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.అప్పలరాజు అన్నారు. రోలుగుంటలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు.

రాష్ట్ర వ్యాప్తంగా 9 నెలలుగా అంగన్వాడీల ఇంటి అద్దెలు, కూరగాయలు, గ్యాస్, టీఏ, డీఏలతో పాటు ఇతర బిల్లులు మంజూరు కాక అప్పులు ఊబిలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే బీమా కల్పించడంలో అధికారులు చొరవ చూపడం లేదన్నారు. ఈ నెల 14న విజయవాడలో జరిగిన ధర్నాకు స్పందించి రాష్ట్ర కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్, సీపీఐ ఎమ్మెల్సీ కత్తి నర్సింగరెడ్డి ఆధ్వర్యంలో ఎస్.మంగాల తదితరులతో జరిపిన చర్చలు అమలు చేయాలని ఆయన కోరారు. ఈ నెల 19 నుండి ఒక్క పూట సెలవు ఇచ్చే విషయం మెమో జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రంగస్థలంపై రక్తి కట్టించిన

మూడు నాటకాల్లో ప్రధాన పాత్రలు

ఎలమంచిలి, న్యూస్‌లీడర్: సాంఘిక, పౌరాణిక నాటకాలు కూడా డబ్బింగుతో విజయవంతం చేయగలమని నిరూపించిన పిల్లా సూరిబాబు... సత్యహరిశ్చంద్ర కాటిసీన్, బాల నాగమ్మలో వజీర్, చింతామణిలో భవానీ శంకర్ పాత్రలను రక్తి కట్టించడంలో తనకు సాటిలేదని అనిపించారు సూరిబాబు. ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో సోమలింగపాలెంలో శ్రీనూకాంబిక అమ్మవారి పండగ సందర్భంగా ఉగాది కొత్త సంవత్సరాది రోజు రాత్రి నిర్వహించిన రంగ స్థల కార్యక్రమంలో సత్యహరిశ్చంద్ర, బాలనాగమ్మ, చింతామణి నాటకాల్లో ముఖ్యపాత్రలను రంగస్థలంపై ప్రదర్శించగా డబ్బింగ్ (ట్రాన్సిట్‌పై) నడిపిన హార్మోనిస్టు కాటిశీన్‌కి పిల్లా సూరిబాబు నిజంటవలో లీలపై డబ్బింగ్‌కి తగ్గ అభినయాలు ప్రదర్శించి చూపరులను ఆకట్టుకుని మరో సంచలన విజయం 63వ స్టేజ్ ప్రోగ్రాంగా అభిమానుల ముందు ఉంచారు సూరిబాబు. ఎలమంచిలిలో గంగా టెక్స్‌టైల్ నడుపుతున్న పిల్లా సూరిబాబుకి రంగస్థలం అంటే చిన్నప్పటి నుంచి మక్కువ. ఆ అభిరుచే తనను మహోన్నతుడిగా తీర్చిదిద్దింది. ఈ రోజు నాటక రంగంలో కూడా డబ్బింగ్ చేయవచ్చని తన ప్రయత్నం విజయవంతమైంది.

"స్మార్ట్"కు సమ్మర్ స్ట్రోక్

హీటెక్కిన ఆంధ్రా ఊటీ

ఆరంభంలోనే భానుడు భగ..భగలు

నగరవాసులు ఉక్కిరిబిక్కిరి



విశాఖపట్నం,న్యూస్‌లీడర్

స్మార్ట్ సిటీ విశాఖపై భానుడు తన ప్రభావాన్ని చూపుతున్నాడు. సమ్మర్ ఆరంభంలోనే వేసవి తాపాన్ని రుచిచూపుతున్నాడు. రాత్రి కాస్త చల్లదనం వున్నా పగలు సూర్యోదయం ఆరంభం నుంచే అగ్నిగుండంలా భానుడు నిప్పులు కక్కుతున్నాడు. దీంతో నగర ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గత కొన్ని రోజులుగా వేసవి తాపం క్రమేపీ పెరుగుతూ వస్తోంది.రోజురోజుకు రెట్టింపు ఉత్సాహంతో ఉష్ణోగ్రతలు తీవ్రతరం అవుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు దాదాపు 40 డిగ్రీలు దాటి నమోదు అవుతుండడంతో సర్వత్రా ఆందోళన మొదలవుతోంది. ఇంకా చలికాలం వీడి వేసవిలో అడుగిడుతున్న సమయంలోనే ఎండలు మండుతుంటే , ఇక ముందు పరిస్థితులు ఇంకెంత దారుణంగా వుంటాయో అన్న ఆందోళనలు సర్వత్రా కనిపిస్తోంది. గత మూడు, నాలుగేళ్లుగా తీవ్రమైన ఎండలను, ఉక్కపోతను చవిచూసిన నగర ప్రజలు ఈ సారి ఎండలు ఎలా వుంటాయో అని భయాందోళనతో వున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే తీవ్రతరమౌతున్న ఎండలు మూలంగా మరిన్ని కష్టాలు తప్పవని భావిస్తున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఏకధాటిగా ఎండలు నిప్పులు చెరగడంతో వివిధ కార్యాలయాలకు వచ్చి వెళ్లేవారు, పాఠశాలలు,కళాశాలలకు రాకపోకలు చేసేవారు, వ్యాపార, ఇతర వ్యవహారాల కోసం బయటకు వచ్చే వారు తప్పని పరిస్థితుల్లో బయటకు రావల్సి వస్తోంది.దీంతో ఎండ బారిన పడకుండా కొందరు గొడుగులు,టోపీలు వంటివి ధరిస్తున్నప్పటికీ వారికి అవేవీ ఎండబారి నుండి కాపాడలేకపోతున్నాయి.ఎండ మరింత తీవ్రతరం కావడంతో నిత్యం పెద్ద ఎత్తున రద్దీగా వుండే నగరంలోని పలు ప్రధాన రహదారులు సైతం నిర్మానుష్యంగా మారాయి. నగరంలో జగదాంబ జంక్షన్, దాబాగార్డెన్స్ ఆశీలమెట్ట, ద్వారకానగర్, గురుద్వార్, అక్కయ్యపాలెం, మద్దిలపాలెం, సీతమ్మధార, కంచరపాలెం, ఎన్ఏడీ, గోపాలపట్నం, గాజువాక వంటి ప్రధాన రహదారుల్లో నిత్యం జనసంచారం వున్న ప్రాంతాల్లో సైతం మిట్టమధ్యాహ్నం పిట్టకాకి కూడా కనిపించకపోవడం గమనార్హం. ఎండ తీవ్రత పెరగడంతో పాటు ఉక్కపోత కూడా తోడవడంతో పలువురు వృద్ధులు, అనారోగ్యానికి గురైనవారు, గర్భిణీలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆరంభంలోనే ఇలాంటి ఎండలేమిటి దేవుడా ? అంటూ వాపోతున్నారు. ఆరోగ్యవంతులు సైతం పగలు బయటకు వచ్చేందుకు భయపడే పరిస్థితులు దాపురించాయి. కాస్త అవకాశం వున్న వారు రాత్రి, పగలు ఇళ్లల్లో ఏసీలకు అతుక్కుపోగా, మరికొందరు తమ ఇళ్లల్లో వున్న ఫ్యాన్లు వేయడం చేసుకుంటున్నారు. మరో వైపు పలు కార్యాలయాల్లో సైతం ఏసీలు ఒక్క క్షణం కూడా ఆపకుండా కొనసాగిస్తూ కాస్త ఊరట పడుతున్నారు.

సేద తీర్చుతున్న కూల్ పాయింట్స్

పాదచారులు, వాహనచోదకులకు ఎండలు మూలంగా అన్నపానం గొంతెండుతుండడంతో ఎక్కడి వరికి అక్కడ గొంతు తడుపుకోవడానికి చల్లని పానీయాలు స్వీకరించాల్సి వస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని అడుగడుగునా వ్యాపారులు కూల్ డ్రింక్స్, కొబ్బరిబొండాలు, పళ్ల రసాల కేంద్రాలను ఏర్పాటుచేయడంతో అటువైపుగా రాకపోకలు చేసే వారు తప్పనిసరిగా వాటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.దీంతో పలువురు చిరు వ్యాపారులు ఎండలను సైతం లెక్కచేయకుండా వినియోగదారులు సేద తీర్చేందుకు తమ తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు.దీంతో వివిధ రకాల పళ్ళ, రసాలు, కూల్ డ్రింక్స్, వాటర్ ప్యాకెట్లు,కొబ్బరిబొండాలు... ఇలా దాహార్తి తీర్చే ప్రతి పానీయానికి డిమాండ్ వుండడంతో నగరంలో పెద్ద ఎత్తున ఈ వ్యాపారాలు సాగుతున్నాయి.

పేరే వున్నా.. ఊరట లేదు

ఒకప్పుడు ఆంధ్రాఊటీగా ఖ్యాతి గాంచిన విశాఖ ఇప్పుడు హీట్ విశాఖగా మారిపోయింది. సువిశాలమైన సాగతీరాన్ని సొంతం చేసుకున్న నగరం పర్యాటకంతో పాటు, దేశ, విదేశాలకు చెందిన అనేక మందికి వేసవి విడిదిగా వుండేది. పలువురు ప్రముఖులు సైతం వేసవిలో ఇక్కడికే వచ్చేవారు. అయితే క్రమేపీ విశాఖలో వాతావరణ పరిస్థితులు మారిపోయాయి. వేసవిలో సైతం వుండే చల్లదనం అదృశ్యమైపోయింది. కనీసం బీచ్‌కు వెళ్లినా ఎండ వేడిమి నుండి ఉపశమనం కలగడం లేదు. దీంతో ఆంధ్రా ఊటీగా పిలిచే విశాఖ హీట్ విశాఖగా మారిపోవడం విచారకరం.

కాలుష్యమే కారణమా ?

పారిశ్రామికనగరంగా పేరెన్నికగన్న విశాఖనగరంలో పలు పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యంగా మూలంగానే ఈ పరిస్థితులు దాపురించినట్లు పలువురు పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటి దీర్ఘ, వృక్షాలు కాలుష్యాన్ని కట్టడిచేయలేకపోవడంతో వాతావరణంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయని, ఫలితంగానే ఎండ దెబ్బ విశాఖకు తప్పడం లేదని తెలుస్తోంది. నగరవ్యాప్తంగా విస్తారంగ ప్రదేశాలు తగ్గుముఖం పట్టడంతో పాటు బహుళ అంతస్తులు పెరిగిపోవడం, హుద్‌హుద్ మహమ్మారి మూలంగా అనేక వట వృక్షాలు నేలకొరగడం, విశాలమైన అటవీ ప్రాంతం సైతం కలప దొంగలు, పలువురు అధికారుల స్వార్థం కోసం నేలకొరగడంతో పాటు రహదారులు, పారిశ్రామిక అభివృద్ధి వంటి కారణాలు చెప్పుకుంటూ ప్రభుత్వమే చాలా ప్రాంతాల్లో అటవీ ప్రాంతం అంతరించిపోయేలా దోహదపడడంతో ఇప్పుడు వర్షాలు తగ్గి ఎండలు పెరిగాయన్న వాదన వినిపిస్తోంది. ఏది ఏమైనా ఇప్పుడే ఇంతగా దారితప్పుతున్న ఎండలు ముందుందు మరింత విజృంభిస్తాయో వేచి చూడాలి మరి.!

అధికారులు అప్రమత్తం కావాలి


అధికారులు కేవలం ఏసీ గదుల్లో కూర్చొని ఆదేశాలు జారీ చేయడంతోనే చేతులు దులుపుకోకుండా వేసవి మూలంగా ప్రాణ నష్టం సంభవించకుండా , ప్రజలకు ఎలాంటి కష్టం కలగకుండాముందస్తుచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ముందుందు వేసవి తీవ్రత మరింత పెరిగే సూచనలు కనిపించడంతో పాటు, వడదెబ్బకు గురయ్యే ప్రమాదం వుందని, గతంలో కూడా అనేక మంది వడదెబ్బ మూలంగా ఇటు నగరంలోను, అటు రూరల్ జిల్లాల్లోను మృతి చెందారని పలువురు గుర్తుచేస్తున్నారు. ప్రజలను చైతన్యవంతం చేయడంతో పాటు , వేసవి చర్యలు కోసం ప్రభుత్వం విడుదలచేసే నిధులను చిత్తశుద్ధితో వ్యయం చేసి ఎండలు నుండి ప్రజలను కాపాడాలని పలువురు కోరుతున్నారు. విరివిగా చలివేంద్రాలు ఏర్పాటుచేయడంతో పాటు, అవసరమైన వైద్య సేవలను ఎక్కడికక్కడే ఏర్పాటుచేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందరికీ అందుబాటులో వుండే విధంగా వైద్యఆరోగ్యశాఖ ఇందు కోసం పటిష్టమైన చర్యలు తీసుకునేలా , ఆ విభాగం అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో సక్రమంగా విధులు నిర్వర్తించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.








శ్రీనూకాంబిక అమ్మవారి దీపాలంకరణ



శివలింగ ఆకారంలో దీపాలంకరణ

అనకాపల్లి, న్యూస్‌లీడర్: పట్టణంలోని ఆకాశవీధి శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయంలో ఉగాది సందర్భంగా ఆదివారం రాత్రి ఆలయం వద్ద పలు దేవతా రూపాలతో దీపాలంకరణ చేశారు. సుమారు వెయ్యి ప్రమిదలతో ఈ దీపాలంకరణ చేశారు. దీపాలు వెలిగించేందుకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చి దీపాలను వెలిగించారు. కనులపండుగగా దీపోత్సవం జరిగింది. ప్రముఖ వైద్యులు డాక్టర్ విష్ణుమూర్తి, సత్యవతులు నూకాంబికా అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వీరిని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొణతాల కన్నబాబు, అభివృద్ధి కమిటీ సభ్యులు కొణతాల ఉమా మహేశ్వరరావు, గొంప నాని, కొణతాల సూర్యారావు, కొణతాల కొండలరావు, అదపా రమణబాబు, దోసపర్తి సన్యాసిరావు పాల్గొన్నారు.

మోదకొండమ్మ అమ్మవారి జీవిత చరిత్రపై సినిమా



కోటను పరిశీలిస్తున్న పోలాకి శివ

మాడుగుల, న్యూస్‌లీడర్: మన్య ప్రజల ఆరాధ్య దేవత మోదకొండమ్మ అమ్మవారి జీవిత చరిత్రను సినిమా తీయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని వర్ధమాన దర్శకుడు పోలాకి శివ సోమవారం ఉదయం తెలిపారు. శ్రీమోదకొండమ్మ క్రియేషన్స్ బ్యానర్‌పై ఇదే మోదకొండమ్మ పేరుపెట్టి సినిమా తీస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా కెమేరా మెన్ అనిల్, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్, కోడైరెక్టర్ చిటారి రమేష్ మాట్లాడుతూ ఏప్రిల్ ఐదవ తేదీ నుండి మాడుగుల రాజుగారి కోటలో సినిమా ప్రారంభిస్తున్నామని, కొన్ని సన్నివేశాలు చిత్రీకరణకు సంబంధించి మహారాజుగారి అనుమతి తీసుకున్నామని వారు తెలిపారు. అమ్మవారి పాటలు పూర్తయ్యాయని, మోదకొండమ్మ జాతరలో పాటలు విడుదల చేస్తామని చెప్పారు. ప్రముఖ నటి మోదకొండమ్మగా నటిస్తున్నారని, ముఖ్య పాత్రలలో బాహుబలి ప్రభాకర్, సత్యప్రకాశ్, సీనియర్ నటులు శివకృష్ణ, రమాప్రభ, ఈశ్వర్ రాజులు నటిస్తున్నారని దర్శకులు శివ తెలిపారు. ప్రస్తుతం చుట్టు ప్రక్కల ప్రాంతాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. పాడేరు మోదకొండమ్మ పాదాలు, విశాఖపట్నంలోను సినిమాను నిర్మిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బుల్లితెర నటులు పుష్పా రెడ్డి, శివాజీ పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాసంకల్ప మానవహారాలు




అమరావతి:
ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధన కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు లోక్‌సభలో ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం సోమవారం చర్చకు రానున్న సందర్భంగా రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజా సంకల్ప మానవహారం కార్యక్రమాలను నిర్వహించారు.
పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్టీ సీనియర్ నేతలతో చర్చించి నిర్దేశించిన ఈ కార్యక్రమంలో పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, మేధావులు భాగస్వాములయ్యారు. రాష్ట్ర ప్రజల ప్రత్యేక హోదా ఆకాంక్ష ఢిల్లీకి తెలిసివచ్చేలా ప్రజాసంకల్ప మానవహారంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు భారీ ఎత్తున పాల్గొన్నారు.
గుంటూరు: అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో మానవహారాలు చేపట్టారు. వేమూరులో పార్టీ నేత మేరుగ నాగార్జున ఆధ్వర్యంలో, వినుకొండ స్వామం సెంటర్‌లో బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో ప్రజా సంకల్ప మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు నినాదాలు చేశారు. కాగా, జిల్లాలో రాయమాను మండలం కొమ్మూరు వద్ద పార్టీ శ్రేణులు చేపట్టిన ప్రజాసంకల్ప మానవహారంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.
విజయవాడ: విజయవాడలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజాసంకల్ప మానవహారాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొని అవిశ్వాస తీర్మానానికి సంఘీభావం ప్రకటించారు.
కర్నూలు: జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మానవ హారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నంద్యాల, కర్నూలు పార్లమెంట్ జిల్లాల అధ్యక్షులు శిల్పా చక్రపాణిరెడ్డి, బీవై రామయ్యలతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.
అనంతపురం: అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా అనంతపురం క్లాక్ టవర్ వద్ద ప్రజాసంకల్ప మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్ రెడ్డి, అనంత వెంకట్రామి రెడ్డి, రాగే పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవిది హత్యే
ములుగు సిద్ధాంతి



శ్రీకాళహస్తి:
శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ఆస్థాన పండితుడు ములుగు రామలింగేశ్వరస్వామి ఉగాది పర్వదినాన పంచాంగ శ్రవణం చేశారు. ప్రముఖ నటి శ్రీదేవిది హత్యేనని, నన్నిహితులే శ్రీదేవిని చంపారని ఆదివారం నిర్వహించిన పంచాంగ శ్రవణంలో ఆయన పేర్కొన్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో టీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో బీజేపీకి ఒక్క లోక్‌సభ సీటు కూడా రాదని పేర్కొన్నారు. ఆలయంలో ఉగాది సందర్భంగా భక్తులైన కన్నప్పకు శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం తరపున సారె అందజేశారు. ఆనవాయితీగా కైలాసగిరి కొండపై వెలసి ఉన్న భక్తకన్నప్ప ఆలయానికి మేళతాళాల నడుమ సంప్రదాయబద్ధంగా వెళ్లి సారెను అందజేశారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కూడా సర్వాంగసుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ నెలకొంది. విద్యుద్దీపాలు, పుష్ప, మామిడి తోరణాలు, అరటి చెట్లతో ఆలయం కొత్తశోభను సంతరించుకుంది. ఈఓ భ్రమరాంబ, ఏఈఓ శ్రీనివాసులురెడ్డి, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఒకే గొడుగు కిందకు త్రివిధ దళాలు!

ఢిల్లీ:
త్రివిధ దళాలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చేందుకు తొలి అడుగు పడింది. ఆర్మీ, నేవీ, వైమానిక దళాలను ఏకంచేసేందుకు థియేటర్ కమాండ్స్ ఏర్పాటుచేయనున్నారు. త్రివిధ దళాల్లో ఏదో ఒక దళానికి చెందిన ఓ అధికారి మిగతా రెండింటిని నియంత్రించడానికి అనుగుణంగా నిబంధనలు, చట్టాల్లో కేంద్ర ప్రభుత్వం మార్పులు తీసుకురానుందని విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నిర్ణయాన్ని ప్రత్యేకంగా అండమాన్ నికోబార్ కమాండ్ త్రివిధ దళాల్లో అమలు చేయనున్నారు. భారత్‌లో తొలిసారిగా థియేటర్ కమాండ్‌ను 2001 అక్టోబరులో ఏర్పాటు చేశారు. కానీ రాజకీయ కారణాలు, అధికారుల ఉదాసీనత, నిధుల లేమి, ప్రతికూల వాతావరణ పరిస్థితులతోపాటు అంతర్గత కలహాల వల్ల ఇది అనుకున్న లక్ష్యాలను చేరుకోలేకపోయింది. ఏఎన్సీ థియేటర్ కమాండ్ ఏర్పాటు అనేది స్వల్ప నిర్మాణ సంస్కరణే అయినా, భారత సైనిక వ్యవస్థలో భారీ సాంస్కృతిక, ప్రాథమిక మార్పు లను సూచించింది. రక్షణ సిబ్బంది, థియేటర్ కమాండ్స్‌కు అధికారులను నియమిస్తే, దేశంలోని ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ విభాగాల్లో మార్పులకు తొలి అడుగు అవుతుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం ఏఎన్సీలోని ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ అధికారులతోపాటు మిగతా వారిని నేవీ కమాండర్ ఇన్ చీఫ్ నేరుగా నియంత్రించే అధికారం ఉంది. దీని చుట్టూ ఉన్న దీవుల సమూహంలోని సైనిక స్థావరాలు కూడా దీని అధీనంలోనే ఉంటాయి. హిందూ మహాసముద్ర ప్రాంతంలో చైనా విస్తరిస్తోన్న ప్రస్తుత పరిస్థితుల్లో దాన్ని నిలువరించేందుకు ఈ ఏకీకృత థియేటర్ కమాండ్ విధానం చాలా అవసరమని నిపుణులు అంటున్నారు. దేశ రక్షణ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చి సీడీఎస్ అధికారి, థియేటర్ కమాండోలను ఏర్పాటుచేయాలని కేంద్ర భావిస్తున్నట్లు తెలిపారు. దేశంలోని 1.5 మిలియన్ల మంది సైనికుల శిక్షణ, రవాణా, నిర్వహణ విధానంలో మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఒకటి లేదా రెండు ఇంటిగ్రేటెడ్ థియేటర్ కమాండోలను ఏర్పాటుచేసి, ఒకటి పశ్చిమాన పాక్ సరిహద్దుల్లో, మరొకటి ఉత్తరంలో చైనాతో సరిహద్దుల్లో నెలకొల్పాలనే ప్రతిపాదనలు చేసింది. కానీ దీని గురించి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌లో ప్రస్తుతం 17 వ్యక్తిగత కమాండోస్ ఉంటే, ఏఎన్సీలో రెండు సమీకృత దళాలు ఉన్నాయి.



ఇదే సమయంలో 2.3 మిలియన్ సైనికులున్న చైనా లిబరేషన్ ఆర్మీలో ప్రస్తుతం ఐదు థియేటర్ కమాండోలు ఉన్నాయి. దీని వల్ల ప్రమాదకర పరిస్థితులు ఎదురైనా సమర్థంగా తిప్పి కొడుతున్నాయి. పశ్చిమ కమాండ్ పూర్తిగా భారత్‌తో సరిహద్దుల్లో వాస్తవాధీన రేఖ వెంబడి కార్యక్రమాలను నియంత్రిస్తుంది. ఇదే విధంగా తూర్పున వెంగ్లా మిలటరీ రీజియన్, ఉత్తరంలో లెంగ్జౌ రీజియన్‌లో వీటిని మోహరించింది.

ఓలా, ఉబర్ కారు సొంతదార్ల సమ్మె

మహారాష్ట్ర:
ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ ఓలా, ఉబర్ డ్రైవర్ల సమ్మె సోమవారం అర్ధరాత్రినుంచి ప్రారంభం అయింది. రాజ్ థాకరే నాయకత్వంలోని ఎంఎన్ఎస్ మహారాష్ట్ర నవనిర్మాణ్ వాహతుక్ సేన ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. దీంతో పలునగరాల్లో క్యాబ్ సేవల వినియోగదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నైలాంటి నగరాలను ఈ సమ్మెతీవ్రంగా ప్రభావితం చేయనుంది. దీంతోపాటు పలు నగరాల్లోని క్యాబ్ వినియోగదారులు ఇబ్బందులను ఎదుర్కొనున్నారు.
"ఓలా, ఉబర్ డ్రైవర్లకు మొదట్లో ఎక్కువ డబ్బుకు హామీ ఇవ్వడంతో పాటు ఎన్నో ఆశలు కల్పించారు. మేము దాదాపు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకూ పెట్టుబడి పెట్టాం. నెలనెలా తమ ఖర్చులతో పాటు, కారుకు పెట్టిన పెట్టుబడిని వెనక్కు రాబట్టుకోవాలంటే నెలకు రూ.1,50,000 వరకూ రావాలి. కనీసం ఇందులో సగం కూడా రావడం లేదు. దీంతో నిరవధిక సమ్మెకు దిగక తప్పలేద"ని సంఘం నాయకులు చెప్పారు.



వేలాదిమంది డ్రైవర్ పార్టనర్స్ తమ ఆందోళనకు మద్దతు ఇస్తున్నారని ఎంఎన్ఎస్ అనుబంధ సంఘం ప్రకటించింది. యూనియన్ అధ్యక్షుడు సంజయ్ నాయక్ మాట్లాడుతూ, సమ్మెకు సహకరించమని జోతులు జోడించి మరీ విజ్ఞప్తి చేస్తామని.. వినకపోతే ఎంఎన్ఎస్ స్టైల్‌లో సమాధానం చెబుతామంటూ హెచ్చరించారు. మరోవైపు తమ డ్రైవర్లకు భద్రత కల్పించాల్సిందిగా ఓలా, ఉబర్ యాజమాన్యాలు పోలీసు అధికారులను కోరాయి. నగరంలో క్యాబ్ రైడ్ సమయంలో ప్రయాణికుల భద్రతకు తగిన చర్యలను డిమాండ్ చేస్తూ ముంబై పోలీసులను కలిశామని ఓలా అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. మరోవైపు మరికొన్ని సంఘాలు ఈ సమ్మెను వ్యతిరేకిస్తున్నాయి. హైదరాబాద్‌లో సమ్మెను పాటించడంలేదని ఇప్పటికే కొన్ని సంఘాలు ప్రకటించడం గమనార్హం.
అయితే ముంబయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పోలీసులు సమీక్షిస్తున్నారు. నిరవధిక సమ్మెకు క్యాబ్ డ్రైవర్లు మొగ్గుచూపుతుండటంతో నగరంలో పోలీసులు 149 సెక్షన్ విధించారు. ఆ మేరకు ఈ సెక్షన్ కింద మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన్ వాహతుక్ సేన సంస్థకు చెందిన సంజయ్ నాయక్, అరిఫ్ షేక్, నితిన్ నంద్‌గోంకర్ తదితరులకు నోటీసులు అందించారు. చట్టాన్ని అతిక్రమించి ఉల్లంఘనలకు పాల్పడినా, ఘర్షణలకు దిగినా కఠిన చర్యలు తీసుకుంటామని సీనియర్ పోలీసు అధికారి పండిట్ థోరట్ చెప్పారు.

పెళ్లిలో భార్య డాన్స్ చేసిందని..



కోల్‌కతా :
ఓ భర్త వివాహ వేడుకలో డ్యాన్స్ చేసిందనే అక్కసుతో తన భార్యను దారుణంగా చంపేశాడు. ఈ ఘటన పశ్చిమ బెంగాల్ 24 పరగణాల జిల్లాలోని బసంతిలో చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే..స్వప్న (18)అనే యువతికి సుజీర్ సమ్మర్ అనే వ్యక్తితో ఇటీవలే వివాహం జరిగింది. అయితే శనివారం తమ బంధువుల వివాహ వేడుకకు సుజీర్, స్వప్న తమ తల్లిదండ్రులతో కలిసి వెళ్లారు. అక్కడ స్వప్న కొంత మంది యువకులతో కలిసి డ్యాన్స్ చేసింది. అది సుజీర్‌కు నచ్చలేదు. దీంతో సుజీర్ అందరి ముందే భార్యతో గొడవ పెట్టుకొన్నాడు. డ్యాన్స్ ఎందుకు చేశావని అక్కడే నిలదీశాడు. దీంతో స్వప్న అలిగి ఇంటికి వెళ్లిపోయింది.
అనంతరం తల్లితో కలిసి సుజీర్ ఇంటికి వెళ్లిపోయాడు. కోపం తట్టుకోలేక తల్లితో కలిసి స్వప్నను గొంతు నులిమి చంపేశాడు. ఆపై తన భార్య ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లుగా అందరినీ నమ్మించేందుకు ప్రయత్నించాడు. అయితే స్వప్న తల్లిదండ్రులు సుజీరే తమ కూతురిని హత్యచేశాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణలో అసలు విషయాలు వెలుగు చూశాయి. దీంతో సుజీర్, అతని తల్లిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కేంద్రాన్ని నిలదీస్తాం
తోట నరసింహ



ఢిల్లీ:
అవిశ్వాస తీర్మానంపై స్పీకర్ చర్చ చేపట్టాలని తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేసింది. తెదేపా లోక్‌సభా పక్ష నేత తోట నరసింహం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. తాము ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి దేశవ్యాప్తంగా అనేక పార్టీలు మద్దతు ప్రకటించాయన్నారు. కేంద్రంపై చంద్రబాబు అవిశ్వాసం తీర్మానం పెట్టారని తెలియగానే ఎన్నో పార్టీలు సానుకూలంగా స్పందించాయని తెలిపారు. జాతీయస్థాయిలో రాజకీయాలు నడిపిన వ్యక్తిగా చంద్రబాబుకు గుర్తింపు ఉందని పేర్కొన్నారు. స్పీకర్ తీర్మానాన్ని టేకప్ చేసి చర్చ చేపట్టేలా ఒత్తిడి తీసుకొస్తామన్నారు. చర్చ ప్రారంభమైతే ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయం, కేంద్రం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై గట్టిగా నిలదీస్తామని తోట నరసింహం తెలిపారు. తెరాస, అన్నాడీఎంకే పార్టీలు తమ రాష్ట్రాల కోసం ఆందోళనలు చేపడుతుండటంతో సభ నిర్వహణపై ఉత్కంఠ నెలకొందని పేర్కొన్నారు.

తెదేపా ఎంపీలకు విప్ జారీ


అమరావతి:
తమ ఎంపీలకు తెలుగుదేశం పార్టీ విప్ జారీచేసింది. పార్లమెంటు సమావేశాలు జరిగినన్ని రోజులు ఎంపీలందరూ ఉభయసభలకు తప్పకుండా హాజరు కావాలని ఆదేశించింది. కేంద్రంపై తెదేపా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై నేడు లోక్‌సభలో చర్చ జరిగే అవకాశం ఉన్నందున పార్టీ ఎంపీలకు విప్ చేసింది.
అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా తెదేపా జాతీయస్థాయిలో వివిధ పార్టీల మద్దతు కూడగడుతోంది. అయితే సభ సజావుగా జరిగితేనే చర్చకు అనుమతిస్తామని స్పీకర్ చెబుతున్న నేపథ్యంలో ఉత్కంఠ నెలకొంది. రిజర్వేషన్ల పెంపు అంశంపై తెరాస, కావేరీ జల వివాదంపై అన్నాడీఎంకే లోక్‌సభలో ఆందోళన కొనసాగించే అవకాశం కనిపిస్తోంది. రిజర్వేషన్ల అంశంతో పాటు విభజన సమస్యలపైనా

రష్యా అధ్యక్షుడిగా.. పుతిన్‌కే పట్టం



మాస్కో :
రష్యా అధ్యక్ష ఎన్నికల్లో వ్లాదిమిర్ పుతిన్ భారీ మెజారిటీతో విజయం సాధించారు. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి 1.30 గంటలకు మొదలైన రష్యా అధ్యక్ష ఎన్నికల పోలింగ్ ఆదివారం అర్ధరాత్రి 11.30 గంటలకు ముగిసింది. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. దాదాపు 99.9శాతం బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు పూర్తయినట్లు, లెక్కించిన ఓట్లలో పుతిన్ 76.67శాతం ఓట్లను సాధించినట్లు రష్యా ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించింది.
వ్లాదిమిర్ పుతిన్ రష్యా అధ్యక్షుడిగా ఎన్నికవడం ఇది నాల్గోసారి. 2000 సంవత్సరంలో ప్రారంభమైన పుతిన్ రాజకీయ ప్రస్థానం ఈ ఎన్నికల్లో గెలుపొందటంతో 2024 వరకూ కొనసాగనుంది. 2012 వరకూ రష్యాలో అధ్యక్షుడి పదవీ కాలం నాలుగు సంవత్సరాలు మాత్రమే. కానీ 2012లో పుతిన్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో పదవీ కాలాన్ని నాలుగు నుంచి ఆరు సంవత్సరాలకు పొడిగించారు. రష్యాను అత్యధిక కాలం పాలించిన నియంత జోసెఫ్ స్టాలిన్ తర్వాత ఎక్కువ కాలం అధ్యక్షుడిగా ఉన్న నాయకుడుగా పుతిన్ రికార్డు నెలకొల్పనున్నారు. పుతిన్‌పై తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ ఆయనకు ప్రత్యామ్నాయంగా మరో బలమైన నేత లేకపోవడం, పుతిన్ ప్రధాన ప్రత్యర్థి అలెక్సీ నావల్నీని ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించడంతో ఏకపక్షంగా ఫలితం వచ్చింది.

లోకేశ్‌నూ చంద్రబాబు నమ్మడం లేదు
వి. విజయసాయిరెడ్డి



న్యూఢిల్లీ:
ప్రత్యేక హోదాపై సీఎం చంద్రబాబు రంగులు మారుస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎంపీ వి. విజయసాయిరెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన పార్లమెంట్ వెలుపల విలేకరులతో మాట్లాడారు. అవసరాన్ని బట్టి పూటకో మాట మార్చడం చంద్రబాబు నైజమని ఆరోపించారు. చంద్రబాబు రాజకీయ విన్యాసాలను ప్రజలంతా గమనిస్తున్నారని చెప్పారు. రాత్రికి రాత్రే ప్రెస్‌మీట్ పెట్టి అరుణ్ జైట్లీ ప్రకటనను స్వాగతించిన విషయాన్ని గుర్తుచేశారు.
నాలుగేళ్లుగా ప్రత్యేక హోదా కోసం పోరాడుతున్నది తామేనని తెలిపారు. అవిశ్వాసంపై చంద్రబాబు ఎలా మాట మార్చారో అందరికీ తెలుసునని అన్నారు. తన నీడను తానే నమ్మలేరని, లోకేశ్ కూడా ఆయన నమ్మడం లేదని.. అటువంటి వ్యక్తి ఏపీ ముఖ్యమంత్రి కావడం ప్రజల దురదృష్టమని వ్యాఖ్యానించారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే తమతో కలిసి రావాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలతో పాటు టీడీపీ ఎంపీలు రాజీనామా చేయాలని విజయసాయిరెడ్డి డిమాండ్ చేశారు.

అవిశ్వాస తీర్మానానికి మద్దతిస్తున్నాం: ఏచూరి



ఢిల్లీ:
ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వనందుకు నిరసనగా ఎన్డీయే ప్రభుత్వంపై ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానానికి తాము మద్దతిస్తామని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పష్టం చేశారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... "మేము అవిశ్వాస తీర్మానానికి మద్దతిస్తున్నాం.. ఎందుకంటే, ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల విషయంలో భాజపా నిస్సిగ్గుగా ప్రజల్ని మోసం చేసింది. ప్రత్యేక హోదాకు హామీ ఇచ్చింది వేరెవరో కాదు, భాజపాయే. యూపీఏ ప్రభుత్వం రాష్ట్రాన్ని విభజించినప్పుడు అప్పటి ప్రధాని ఐదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామన్నప్పుడు... వచ్చేది తమ ప్రభుత్వమే కాబట్టి పదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామన్నారు. నేను స్వయంగా ఆ చర్చల్లో పాల్గొన్నాను. అధికారికంగానే వారీమాట చెప్పారు. ఇప్పుడెందుకు చేయడం లేదు? వారిచ్చిన హామీనే వారు ఉల్లంఘిస్తున్నారు. అది ఆమోదయోగ్యం కాదు. అవిశ్వాస తీర్మానంపై చర్చలో వారి మోసాన్ని ఎండగడతాం" అని ఏచూరి తెలిపారు.

సొంత వ్యాపారాలకు సై అంటోంది 5శాతమే!

అహ్మదాబాద్:
వ్యాపారం చేయడమంటే అంత సులువేం కాదు. లాభనష్టాలు.. గెలుపోటములు ఇలా అన్నింటిని సరిసమానంగా చూసుకుంటూ పోవాలి. అందుకేనేమో చాలా తక్కువ మంది ఈ రంగాన్ని ఎంచుకుంటున్నారు. మన దేశంలో అయితే సొంతంగా వ్యాపారాలు ప్రారంభించే వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. దేశీయ వయోజనుల్లో కేవలం 5 శాతం మంది మాత్రమే సొంత వ్యాపారాలను ప్రారంభిస్తున్నారట. ఈ విషయంలో ప్రపంచ దేశాలతో పోలిస్తే మనం అట్టడుగు దేశాల జాబితాలో ఉన్నాం. అయితే వ్యాపారాలను అర్థాంతరంగా నిలిపివేయటంలో మాత్రం 26.4 శాతంతో ముందు వరుసలో ఉన్నాం. ఇటీవల నిర్వహించిన ఓ సర్వేలో ఈ విషయం వెల్లడైంది.
వ్యవస్థలను ప్రారంభించడంలో యువత ఆసక్తిపై గుజరాత్‌లోని గాంధీనగర్‌కు చెందిన ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, దాని అనుబంధ సంస్థలు ఇటీవల ఓ సర్వే నిర్వహించాయి. 18 నుంచి 64 ఏళ్ల వయసున్న 3,400 మందితో సర్వే జరిపి 'గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మానిటర్(జీఈఎం) ఇండియా' పేరుతో నివేదిక రూపొందించాయి. దీని ప్రకారం.. దేశీయ వయోజనుల్లో కేవలం 5శాతం మంది మాత్రమే సొంత వ్యాపారాలను ప్రారంభిస్తున్నారు. వీరు మాత్రమే వ్యాపారాలను మూడేళ్ల కంటే ఎక్కువ కాలం నుంచి కొనసాగిస్తున్నారు. కొందరు వ్యాపారాలను ప్రారంభిస్తున్నప్పటికీ మూడేళ్లలోపే నిలిపివేస్తున్నట్లు తేలింది.
ప్రపంచ దేశాలతో పోలిస్తే ఇది చాలా తక్కువ అని నివేదిక పేర్కొంది. బ్రిక్స్ దేశాల్లో 17శాతంతో బ్రెజిల్ తొలిస్థానంలో ఉంది. ఇక దక్షిణాఫ్రికాలో 3శాతం మాత్రమే సొంత వ్యాపారాల వైపు మొగ్గుచూపుతున్నారు. చైనాలో 8శాతం.. రష్యా, భారత్‌లో 5శాతం మంది వ్యాపారాలకు సై అంటున్నారు.
ఇక దేశీయ వయోజనుల్లో 11శాతం మంది తమ కెరీర్ తొలినాళ్లలో వ్యాపారాలను ప్రారంభించాలని ఆసక్తి చూపిస్తున్నారు. అయితే వీరిలో సగానికి పైగా మంది తమ వ్యాపారాల వృద్ధిపై విశ్వాసం చూపించడం లేదు. అంతేగాక.. ఉద్యోగులను నియమించుకోవడంలోనూ వీరు అంతంత మాత్రంగానే ఉన్నారు. ఇదిలా ఉండగా.. వ్యాపారాలను అర్థాంతరంగా మూసివేయడం మన దేశంలో 26.4శాతంగా ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. ఆర్థిక ఇబ్బందులు, లాభాల కొరత, వ్యక్తిగత, ఇతర కారణాలతో వీరు తమ సంస్థలను మూసేస్తున్నట్లు ఈ సర్వేలో తేలింది.

250 కోట్లు కాదు..
రూ.4వేలకోట్ల స్కాం

ముంబై:
రూ.250 కోట్ల బ్యాంకింగ్ కుంభకోణం ఆరోపణలతో ముంబైకి చెందిన పరేఖ్ అల్యూమినెక్స్ లిమిటెడ్ (పీఏఎల్) డైరెక్టర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ స్కాంపై జరుగుతున్న దర్యాప్తులో భాగంగా పోలీసులు సంస్థకు చెందిన ముగ్గురు డైరెక్టర్లను ఆర్థిక నేరాల విభాగం అధికారులు అరెస్టు చేశారు. అంతేకాదు గతకొన్నేళ్ల క్రితం వెలుగు చూసిన ఈ స్కాం విలువ వేలకోట్ల రూపాయలకు విస్తరించింది. ఈ స్కాం మొత్తంవిలువ రూ .4,000 కోట్లుగా ఉందని ప్రయివేటురంగ బ్యాంకు యాక్సిస్ బ్యాంకు తన తాజా ఫిర్యాదులో పేర్కొంది.
20పైగా బ్యాంకుల గ్రూపును పీఏఎల్ మోసం చేసింది. బూటకపు కంపెనీల పేరుతో మోసపూరితమైన నకిలీ ఇన్‌వాయిస్లు, బిల్లులతో కుంభకోణానికి పాల్పడ్డారని బ్యాంకు ఆరోపించింది. దీంతో ఫోర్జరీ, నిబంధనల ఉల్లంఘన, నేరపూరిత కుట్రకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భవార్‌లాల్ భండారి, ప్రేమల్ గోరఖ్‌నాథ్?,కమలేష్ కనుంగోలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కుంభకోణంలో బ్యాంకు అధికారుల పాత్రపై అధికారులు ఇంకా ఎలాంటి వ్యాఖ్య చేయలేదు.
2011లోనే పరేఖ్ నేతృత్వంలోని పీఏఎల్ రూ. 127.58కోట్ల కుంభకోణం వెలుగులోకి వచ్చింది. 22 బ్యాంకులతో కలిపి ఇచ్చే రుణ ఒప్పందంలో భాగంగా ఈకుంభకోణం జరిగిందని ఎఫ్ఐఆర్ దాఖలు చేసింది. సంస్థ డైరెక్టర్లు అమితాబ్ పరేఖ్ (2013 లో మరణించారు), రాజేంద్ర గోత్, దేవన్న దేశాయ్, కిరణ్ పారిక్, విక్రమ్ మొర్దానీ పేర్లనుకూడా తన ఫిర్యాదులో చేర్చింది. కాగా పరేఖ్ అల్యూమినెక్స్

సంచలన వార్తా పత్రిక
లీడర్
విశాఖపట్నం
మంగళవారం 20-3-2018

చిరు పొగడ్త.. సుకుమార్ ఆవేదన

చిరంజీవి పొగిడితే సుకుమార్ ఆనందపడాలి కానీ.. ఆవేదన చెందడం ఏంటి అంటారా? ఇది నిజం అంటున్నాడు సుక్కు. మరి బాధ ఎందుకు అంటే.. చిరంజీవి పొగిడినపుడు తన వెంట ఎవరూ లేనందుకట. ఆ స్థాయిలో తనను పొగిడేశాడట మెగాస్టార్. చిరంజీవి తనయుడు రామ్ చరణ్ హీరోగా సుకుమార్ 'రంగస్థలం' సినిమా తీసిన సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని కొన్ని రోజుల కిందటే చిరు చూశారు. ఆయనకు విపరీతంగా నచ్చేయడం సుకుమార్ ను ఫోన్ చేసి ఇంటికి పిలిపించుకుని మరీ చిరు అభినందించాడట. చిరు పొగిడిన తీరుతో తనకు మాటలు రాలేదని.. ఆ ఆనందాన్ని ఎవరితో ఎలా పంచుకోవాలో తెలియలేదని సుకుమార్ చెప్పాడు.




మహేష్ హీరోయిన్ల హౌస్ ఫుల్

టాలీవుడ్ లో ఒక్కసారి అడుగుపెడితే చాలు కోలీవుడ్ టూ బాలీవుడ్ ఆఫర్స్ ఈజీగా వచ్చేస్తాయని గత కొన్నేళ్లుగా మోడల్స్ గట్టిగా నమ్ముతున్నారు. అంతే కాకుండా అన్ని బాషలలో ఒక నటిగా మంచి గుర్తింపు తెచ్చుకోవాలని కథ నచ్చితే ఒకే చేస్తున్నారు. ముఖ్యంగా నార్త్ భామలు టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ తో ఒక్కసారి నటించిన చాలు అనుకుంటున్నారు. అయితే అలా నటించిన స్టార్ హీరోయిన్స్ ఇప్పుడు ఒకే సినిమాలో కలిసి నటించబోతున్నారు.మహేష్ తో కాదు లెండి. బాలీవుడ్ సక్సెస్ ఫుల్ గా కొనసాగుతోన్న హౌస్ ఫుల్ సిరీస్ లో నటించడానికి రెడీ అయ్యారు. మహేష్ బాబుతో వన్:నేనొక్కడినే సినిమాలో నటించిన కృతి సనాన్ అలాగే ప్రస్తుతం భరత్ అనే నేను సినిమాలో నటిస్తోన్న కైరా అద్వానీ లు హౌస్ ఫుల్ 4 లో అవకాశం అందుకున్నారు. ప్రయోగాల హీరో అక్షయ్ కుమార్ - రితేష్ దేశ్ ముఖ్ - అమితాబ్ బచ్చన్ కథానాయకులుగా కనిపించబోతున్న సంగతి తెలిసిందే.ఇక వారితో పాటు సన్నీ డియోల్ కూడా ఒక ప్రత్యేక పాత్రలో అలరించనున్నారు. ఇక అక్షయ్ సరసన కృతి ఒకే అయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అమ్మడి టైమింగ్ చాలా బావుంది. చేసిన సినిమాలు మంచి విజయానికి అందుకోవడంతో ఆఫర్స్ గట్టిగా వస్తున్నాయి. ఆమె సోదరి కూడా ప్రస్తుతం సినిమాల్లోకి రావడానికి సిద్ధమవుతోంది.

ఉగాది పురస్కారం అందుకున్న పరమేశ్వరరావు , సతీష్



శిల్పి పరమేష్ సత్కరిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్: పట్టణంలోని గవరపాలెం దిబ్బవీధికి చెందిన స్వర్ణ కంకణధార గ్రహీత శిల్పి విల్లూరి పరమేశ్వరరావుకు ఉగాది పురస్కారం లభించింది. అమరావతిలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన ఉగాది పురస్కారాల కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు చేతులమీదుగా పరమేశ్వరరావుకు పురస్కారాన్ని అందించారు.



ఉగాది పురస్కారాన్ని అందుకుంటున్న శిల్పి సతీష్

పట్టణంలోని గవరపాలెంకు చెందిన దొడ్డి సతీష్‌కు శిల్ప కళలలో విశిష్టమైన కృషి చేసినందుకు గాను అమరావతిలో జరిగిన ఉగాది పురస్కా రాల సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా కళారత్న (హంస పురస్కారాన్ని) అందుకున్నారు. ఈ పురస్కారాన్ని అందుకున్న సతీష్‌ను మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, జగన్ ప్రభాకర్, జయవీర్, రత్నాకర్‌లు, పలు స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు అభినందించారు.

మెగా లోన్ ఎక్స్ఛేంజ్ మేళా బంపర్ డ్రా విజేతలు



న్యూస్‌లీడర్, విశాఖపట్నం : ఇటీవల నిర్వహించిన మేళాలో కొనుగోలు చేసిన వాహనచోదకులకు ఉగాది సందర్భంగా దొండపర్తిలోని విశాఖ ఆటో ఫైనాన్స్ కార్యాలయం వద్ద మెగా బంపర్ డ్రా తీశారు. ఈ డ్రాలో ప్రథమ బహుమతి ఎండాడ నివాసి సిహెచ్.హరీష్ (రూ.30వేలు), ద్వితీయ బహుమతి సింహాచలానికి చెందిన కె. గురునాథ్ (రూ.20వేలు), తృతీయ బహుమతి సీతమ్మధారకు చెందిన స్నేహలత పండా(రూ.10వేలు) ను వరించాయి. విశాఖపట్నం, గాజువాకల్లో ఈ నెల 12,13,14,15 తేదీల్లో పద్మపూజిత ఆటోఫైనాన్స్, విశాఖ ఆటోఫైనాన్స్, సిరి ఆటోఫైనాన్స్, పవన్‌సాయి ఆటోఫైనాన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన మెగా లోన్, ఎక్స్చేంజ్ మేళాకు అపూర్వ ఆదరణ లభించిన సంగతి తెలిసిందే. ఈ మేళాలో సుమారు వేలాది మంది వినియోగదారులు విచ్చేసి తమ అభిరుచులకు తగిన వాహనాలను కొనుగోలు చేశారు. సుమారు 250 మంది వినియోగదారులు ఈ మేళాలో వాహనాలను కొనుగోలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. డ్రా అనంతరం సిరి ఆటో ఫైనాన్స్ మేనేజింగ్ పార్టనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మేళాకు చివరి రెండు రోజులు వేలాది మంది ప్రజలు విచ్చేశారన్నారు. బహుమతులు సొంతం చేసుకున్న వినియోగదారులకు ఆయన అభినందనలు తెలియజేసారు. ఈ మేళా మరింత ఉత్సాహానిచ్చిందని విశాఖ ఆటో ఫైనాన్స్ మేనేజింగ్ పార్టనర్‌సాయిబాబా అన్నారు. కార్యక్రమంలో పద్మపూజిత ఆటో ఫైనాన్స్ మేనేజింగ్ పార్టనర్ కె. త్రినాథ్, సిబ్బంది, పాల్గొన్నారు.

అమ్మ పోయాకే అన్న దగ్గరయ్యాడు





శ్రీదేవి మరణం తర్వాత కపూర్ కుటుంబంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గతంలో ఎడమొహం పెడమొహంలా జాన్వీ-ఖుషిలతో చాలా గ్యాప్ మైంటైన్ చేసిన బోనీ మొదటి భార్య సంతానం అన్షులా - అర్జున్ కపూర్ లలో చాలా మార్పు రావడం బాలీవుడ్ సర్కిల్స్ లో హాట్ టాపిక్ గా మారింది. ముఖ్యంగా అర్జున్ తండ్రికి నైతిక బలం ఇవ్వడానికి చేయగలిగింది అంతా చేస్తున్నాడు. ఇటీవలే బోనీ కపూర్ తన ఇద్దరు కూతుళ్ళను వెంటబెట్టుకుని అర్జున్ కపూర్ ఇంటికి వెళ్ళడం చర్చనీయాంశంగా మారింది. లోపల ఏం మాట్లాడుకున్నారు అనేది బయటికి తెలిసే ఛాన్స్ లేదు కాని బయటికి వచ్చాక కొడుకుని దగ్గరకు తీసుకుని నుదుటిపై ముద్దు పెట్టుకుని అక్కడి నుంచి సెలవు తీసుకుంటున్న ఫోటోలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. శ్రీదేవి దుబాయ్ లో అకాల మరణం చెందినప్పటి నుంచి సాధ్యమైనంత వరకు తండ్రితోనే ఉండడానికి ప్రయత్నిస్తున్న అర్జున్ కపూర్ తన షూటింగ్స్ కు ఇబ్బంది కలుగుతున్నా అవేవి లెక్క చేయటం లేదట. మరోవైపు ఏనాడూ మాట్లాడు కోని అన్షులా కపూర్ ఇప్పుడు జాన్వీ-ఖుషిలకు మంచి ఫ్రెండ్ గా మారిపోయింది. ఈ మధ్యే శ్రీదేవి కూతుళ్ళ గురించి ఒకడు అసభ్యంగా కామెంట్ చేస్తే నా చెల్లెళ్ళను ఏమైనా అంటే ఊరుకునేది లేదని అన్షులా వార్నింగ్ ఇవ్వడం బాగా ప్రచారం అయ్యింది. దానికి తోడు ఆ మరుసటి రోజే అన్షులాలా జాన్వీ ట్విట్టర్ లో ఫాలో కావడం మొదలు పెట్టింది. దీన్ని బట్టి ముందు రెండు కుటుంబాల మధ్య ఎంతటి అగాధం ఉండేదో అర్ధమవుతుంది. శ్రీదేవి ఫాన్స్ మాత్రం ఈ మాత్రం ప్రేమ - కలయిక ఆమె బ్రతికి ఉన్నప్పుడే జరిగి ఉంటే ఇంకా బాగుండేదని నిట్టూరు స్తున్నారు . ఆవిడ బ్రతికి ఉండగా తన పిన తల్లి అని ఒప్పుకోవడానికి కూడా ఇష్టపడని అర్జున్ కపూర్ ఇప్పుడు కాబట్టి మారాడు కాని లేకపోతే పరిస్థితిలో పెద్ద మార్పు ఉండేది కాదు. జాన్వీ నటిస్తున్న డెబ్యు మూవీ ధడక్ షూటింగ్ దాదాపు పూర్తి కావొస్తోంది. శ్రీదేవికి ఘనమైన నివాళిగా జూన్ లో భారీ విడుదలకు ప్లాన్ చేస్తున్నారు.

గంట్ల శ్రీనుబాబుకి ఉగాది పురస్కారం




ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా స్వీకరణ

విశాఖపట్నం : వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షుడు, రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య కార్యదర్శి గంట్ల శ్రీనుబాబుకు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారం ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం ఉదయం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఉగాది వేడుకల్లో రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతులమీదుగా శ్రీనుబాబు ఈ అవార్డును స్వీకరించారు. రాష్ట్రాభివృద్ధికి జర్నలిస్టులు కూడా సహకారం అందించాలని కోరారు. తదుపరి శ్రీనుబాబును ఉగాది పురస్కారంతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. రాష్ట్రాభివృద్ధిలో జర్నలిస్టులు కూడా భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రస్థాయి పురస్కారం పొందిన శ్రీనుబాబును ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ కోడెల శివప్రసాదరావు, డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, మంత్రులు భూమా అఖిలప్రియ, దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. అవార్డు స్వీకరించిన అనంతరం శ్రీనుబాబు మాట్లాడుతూ ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పలు అవార్డులు స్వీకరించడం జరిగిందని, తాజా పురస్కారంతో మరింత బాధ్యత తనపై పెరిగిందన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి మరింతగా కృషిచేస్తామన్నారు. ఈ అవార్డుకు విశాఖ జర్నలిస్టులకు అంకితమిస్తున్నట్టు ప్రకటించారు.



రంగమ్మత్తగా అనసూయ

ప్రియలా కన్ను కొడితే ఏడాది బ్యాన్



తదేశంలో కన్నుకొట్టే నైపుణ్యానికి బ్రాండ్ అంబాసిడర్ అయిపోయింది మలయాళ అమ్మాయి ప్రియ ప్రకాష్ వారియర్. 'ఒరు అడార్ లవ్' సినిమా కోసం రూపొందించిన ఒక పాటలో ఆమె కన్ను కొట్టిన వైనం చూసి కోట్లాది మంది కుర్రాళ్ల గుండెలు లయ తప్పాయి. ఆ వీడియో ప్రపంచవ్యాప్తంగా వైరల్ అయిపోయింది. నాటి నుంచి కోట్లాది మంది ప్రియను అనుకరించే ప్రయత్నం చేస్తున్నారు. అమ్మాయిలు ప్రియను మ్యాచ్ చేసేందుకు చాలా ప్రయత్నమే చేస్తున్నారు. కాలేజీల్లో చాలామంది అమ్మాయిలు ఇదే ప్రయత్నంలో ఉంటుండటం యాజమాన్యాలకు ఇబ్బందిగా మారుతోంది. తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన ఒక కాలేజ్ మేనేజ్మెంట్ ఈ విషయంలో సీరియస్ అయింది. తమ కాలేజీలో అమ్మాయిలు ఎక్కడ చూసిన కన్ను కొట్టడం ప్రాక్టీస్ చేస్తూ కనిపిస్తుండటంతో ఇక లాభం లేదని ఒక సర్క్యులర్ జారీ చేశారు. కాలేజీ పరిసరాల్లో కన్ను కొట్టడం నిషేధమని.. కాలేజీ అంతటా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశామని.. ఎవరైనా కన్ను కొట్టడం చేస్తున్నట్లు గమనిస్తే ఏడాది పాటు కళాశాల నుంచి బహిష్కరిస్తామని వీఎల్బీ జానకి అమ్మల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ యాజమాన్యం సర్క్యులర్ జారీ చేయడం గమనార్హం.

నాపై నాకే గౌరవం పెరిగింది-చరణ్



రంగస్థలం' తనకు జీవిత కాల అనుభవం అని.. ఈ సినిమా షూటింగ్ అయిపోయిందని తనకు చాలా బాధేస్తోందని.. ఈ చిత్రాన్ని.. సుకుమార్ ను చాలా చాలా మిస్సవుతానని అన్నాడు రామ్ చరణ్. ఈ చిత్రం తన కెరీర్లో ఒక మైలురాయి అని.. తన తండ్రికి 'ఖైదీ'.. 'స్వయం కృషి'.. 'ఆపద్బాంధవుడు' లాంటి సినిమాల మాదిరే తనకూ ఇది ప్రత్యేకమైన చిత్రమని.. దీన్ని ఒక సినిమాలా కాకుండా ఒక అనుభవం లాగా తాను భావిస్తానని చరణ్ చెప్పాడు. తన తల్లిదండ్రులతో పాటు అభిమానులు సైతం గర్వించే చిత్రం 'రంగస్థలం' అని చెప్పగలనని.. ఈ సినిమాలో చిట్టిబాబుగా తనకు తాను నచ్చేశానని.. తనపై తనకు చాలా గౌరవం పెరిగిందని.. ఇదంతా సుకుమార్ ఘనతే అని చరణ్ అన్నాడు.ఈ సినిమాను దాదాపు ఏడాది తీశామని.. ఐతే కొన్నిసార్లు ఇంత లేటవుతోందేంటి.. సుకుమార్ ఇలా చేస్తున్నాడేంటి అనిపించినప్పటికీ.. చిట్టిబాబు పాత్రను.. ఈ సినిమాలో నటించడాన్ని చాలా ఆస్వాదించడం వల్ల తాను సుక్కుకు గట్టిగా ఈ విషయం చెప్పలేకపోయానని.. నిజానికి ఇంకా కొన్నాళ్లు ఈ సినిమాలోనే నటిస్తూ ఉండాలనిపించిందని.. లుంగీ.. గడ్డం లాంటి వాటిని ఇప్పుడు చాలా మిస్సవుతున్నానని.. రీషూట్లు అవసరమైతే మళ్లీ గడ్డం పెట్టుకుని వచ్చి నటించాలనిపిస్తోందని చరణ్ చెప్పడం విశేషం. 'రంగస్థలం' చేశాక మనం సిటీల్లో ఎందుకుంటున్నాం.. పల్లెల్లోనే బతకొచ్చు కదా అనిపించిందని.. తన జీవితంలో ఎప్పుడూ పల్లెటూరిలో జీవించే అవకాశం రాకపోయినా.. ఈ సినిమా ద్వారా ఆ అనుభూతిని పొందినందుకు సంతోషంగా ఉందని.. పల్లె జనాల స్ఫూర్తితోనే తన పాత్రను పోషించానని చరణ్ అన్నాడు.

Printed, Published and Owned by V.V.Ramana Murthy and Printed at LEADER PRESS, 58-14-109/5, Block No. 113 A, VUDA Layout, Marripalem, Visakhapatnam - 530009, A.P. and Published at 47-10-7/3, Diamond Park Junction, Visakhapatnam - 530016, A.P.
EDITOR - V.V. RAMANA MURTHY, **RNI NO: 72163/99**, **Registered Postal Regd. No. - VSP/211/2015-17 E-MAIL andhraleader@gmail.com, Telephone Nos. 0891-6660599, 98488 49832**